# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in

విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 205 | పేజీలు : 08 | బుధవారం | 05-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# ప్రభుత్వ ఆఫీస్‌లకు 'టీ-ఫైబర్'తోనే ఇంటర్‌నెట్

**ఫ్యూచర్ సిటీకి కూడా ఇదే అందించాలి**

**వచ్చేనెల నుంచి ప్రైవేటు నెట్ ఆపరేటర్లకు బిల్లులు ఇవ్వద్దు**

**ఇంటింటికీ ఇంటర్‌నెట్.. 2 నెలల్లో కార్యాచరణ**

**లోకల్ కేబుల్ ఆపరేటర్ల భాగస్వామ్యంతో కనెక్షన్ ఇచ్చేలా ఏర్పాట్లు: మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్ పల్స్,డెస్క్



రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబరు 1నుంచి కేవలం టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్‌నెట్ సేవలు అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. అప్పటినుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్‌నెట్ సేవల కోసం ప్రైవేటు ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టంచేశారు. మంగళవారం సచివాలయంలో 'టీ-ఫైబర్'పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, టీ-ఫైబర్ ఎండీ వేణుప్రసాద్‌లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గడిచిన ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేశామని, ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.13కోట్లు ఆదా అయిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కూడా ఈ సేవలను విస్తరించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (టీ-స్వాన్)ను నెల రోజుల్లో పూర్తిస్థాయిలో టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీకి పూర్తిస్థాయిలో ఇంటర్‌నెట్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని 'టీ-ఫైబర్'కు సూచించారు. టీ-ఫైబర్ నెట్ వినియోగం ద్వారా ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.300-400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని, అంతేకాకుం డా పూర్తిస్థాయిలో డేటాకు సెక్యూరిటీ ఉంటుందని తెలిపారు. రాష్ట్రం లో ఇంటింటికీ ఇంటర్‌నెట్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, వచ్చే రెండు నెలల్లోనే ఇందుకు కార్యాచరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం లోకల్ కేబుల్ ఆపరేటర్ల భాగస్వామ్యంతో నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించినట్టు తెలిసింది.

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పీహెచ్‌డీ

పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల్లో జరిగే పరిశోధనలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో తెలంగాణ లైఫ్ సైన్సెస్, బిట్స్ పిలానీ, ఆస్ట్రేలియాకు చెందిన ఆర్ఎంఐటీ యూనివర్సిటీ సంయుక్తంగా 'ఇండస్ట్రీ-ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం'ను ప్రారంభించాయి. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలనే పరిశోధనాంశాలుగా తీసుకోవడం దీని ప్రత్యేకత అని తెలిపారు. ప్రముఖ లైఫ్ సైన్సెస్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) పనిచేస్తున్న నిపుణులు తమ ఉద్యోగాలను కొనసాగిస్తూనే అంతర్జాతీయ స్థాయి పర్యవేక్షణలో డాక్టోరల్ పరిశోధనలు చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు. ఆయా కంపెనీలు తమ ఉద్యోగులు, పరిశోధకులను స్పాన్సర్ చేయనుండగా.. బిట్స్ పిలానీ, ఆర్ఎంఐటీ వర్సిటీలు అకడమిక్ పర్యవేక్షణ, అంతర్జాతీయ నైపుణ్యం, రీసెర్చ్ మెంటార్‌షి?పను అందించనున్నాయి. తద్వారా పరిశ్రమలకు ఉపయోగపడే పరిశోధనలు, టెక్నాలజీ బదిలీకి ఊతమివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమావేశంలో ఆర్ఎంఐటీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అలెక్ కామెరాన్, బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.రామ్‌గోపాల్‌రావు, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేష్ సింగ్‌తోపాటు సాండోజ్, బీఎంఎస్, ఎంఎస్‌డీ, సనోఫీ, నోవార్టిస్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీసు నియామకాల్లో రాజకీయ జోక్యం!

**ప్రక్రియకు భంగం కలిగించేందుకు కొన్ని పార్టీల యత్నం**

**7437 పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రికి నిఘావర్గాల నివేదిక**

**అత్యవసర సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ పల్స్,డెస్క్



పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించాలని.. ఎలాంటి లోపాలకూ ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. ప్రశ్న పత్రాల తయారీ, ముద్రణ, రవాణా.. ఇలా అన్నింటా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేకంగాదృష్టి సారించాలని.. కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యేదాకా సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రతి క్వింటాల్ బియ్యం రాబడతాం

**కస్టమ్ మిల్లింగ్ బకాయిలన్నీ వసూలు చేస్తాం**

**డిఫాల్టర్ మిల్లర్ల ఆస్తులు జప్తు చేసి క్రిమినల్ కేసులు పెడతాం: మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్ పల్స్,డెస్క్

రాష్ట్రంలో దశాబ్దకాలంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పక్కదారి పట్టిస్తూ.. ప్రభుత్వానికి బకాయిలు ఎగ్గొడుతున్న డిఫాల్ట్ మిల్లర్లను ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వారి నుంచి ప్రతి క్వింటాల్ బియ్యాన్ని, చివరి రూపాయి బకాయిని వసూలు చేసి తీరతామన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గత 10-12 సంవత్సరాలకు సంబంధించి జిల్లాలు, మిల్లుల వారీగా డిఫాల్టర్ల జాబితాలను సిద్ధం చేసి ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఇన్నాళ్లూ మిల్లర్లు సకాలంలో బియ్యం ఇవ్వకపోవడం, ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా అమ్ముకోవడం, కోర్టుల్లో కేసులు వేయడంతో ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక, పరిపాలనా సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి చెప్పారు. ప్రభుత్వ బకాయిలు చెల్లించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చర్యలను వేగవంతం చేయడమే కాకుండా వారి స్థిర, చరాస్తులను వెంటనే జప్తు చేయాలని నిర్ణయించామని తెలిపారు. తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారి బ్యాంక్ గ్యారెంటీలు, సెక్యూరిటీలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. డిఫాల్టర్లను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు 'ఎర్లీ వార్నింగ్ సిస్టమ్'ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ కదలికలను టెక్నాలజీ ఆధారంగా పర్యవేక్షించడంతో పాటు, ఆకస్మిక తనిఖీల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ రూపొందిస్తున్నామని చెప్పారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ డీఎస్ చవాన్‌తో పాటు శాఖ ఉన్నతాధికారులు, ఫూఐనాన్స్, లీగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్ర నాశనం కోసం హరీశ్ క్షుద్రపూజలు

హైదరాబాద్ పల్స్,డెస్క్



ఎవరైనా రాష్ట్రం బాగు కోసం దేవుళ్లకు పూజ చేస్తారని, కానీ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాత్రం రాష్ట్రం నాశనం కోరుతూ క్షుద్ర పూజలు చేయించారని టీపీసీసీ అధ్యక్షుడు మహ్హ?షకుమార్‌గౌడ్ సంచలన వ్యాఖ్య లు చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా కరువు పరిస్థితులు ఏర్పడాలని కోరుతూ.. హరీశ్‌రావు మార్చి 2న తిరుచ్చి, జూన్ 1న శివమొగ్గలో క్షుద్రపూజలు చేశారని, అందుకు ఆధారాలు ఉన్నట్టు చెప్పారు. వరుస ఎన్నికల్లో ఓటమితో ప్రజ లు తమవైపు లేరని అర్థం చేసుకున్న హరీశ్‌రావు.. ఇలాంటి పూజలు చేస్తే లాభం కలుగుతుందని అనుకుని ఉంటాడన్నారు. ఎప్పుడు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే హరీశ్.. ఆ ఆలయాలకు సంబంధించిన ఫొటోలు, వివరాలను ఎందుకు పంచుకోలేదని సందేహం వ్యక్తం చేశారు. ఆ తేదీల్లో ఎక్కడ ఉన్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు తాము ఆధారాలు బయటపెడతామని చెప్పారు. హరీ శ్‌రావు తన తప్పును ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. వాస్తవాలు బయటపడడంతోనే భయపడి, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డికి లీగల్ నోటీసులు పంపారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్, ఆ పార్టీ నాయకులు అఘోరాలతో తాంత్రిక, క్షుద్ర పూజలు చేయిస్తున్నారన్న ప్రచారం ఉందని.. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చూశాక అది నిజమేనన్న అనుమా నం కలుగుతోందని పేర్కొన్నారు. ఉద్యమం సమయంలో హరీశ్ అగ్గిపెట్టె నాటకంవల్ల ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు.

# మహేశ్‌గౌడ్ క్షమాపణలు చెప్పాలి

హైదరాబాద్ పల్స్,డెస్క్

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు లీగల్ నోటీసు పంపారు. క్షుద్రపూజలు చేశారంటూ తనపై చేసిన నేరపూరిత వ్యాఖ్యలకు సంబంధించి తన అడ్వకేట్ ద్వారా హరీశ్ నోటీసులు పంపారు. మీడియా, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేశారని, మహేశ్‌కుమార్‌గౌడ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే సివిల్, క్రిమినల్, పరువు నష్టం దావాలు వేస్తామని స్పష్టంచేశారు. ఆధారాల్లేని ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకుల మానసిక అసమతుల్యతకు నిదర్శనమని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిస్థితి గాల్లో దీపంలా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారమయ్యేలా చూడాలని టీవీవీపీ పరిధిలోని వైద్య ఉద్యోగులు మంగళవారం హరీశ్‌ను ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, పూర్తిస్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# పావురాలతో ఇబ్బందిపడుతున్నారా?

పావురాలంటే ఎవరికి ఇష్టం ఉండదు? ఆహారం తింటూ రెక్కలాడిస్తూ, కువకువలాడుతుంటే చూడ ముచ్చటగా ఉంటుంది. అయితే అదే పావురాలు ఇంటిని ఆగం చేస్తే ప్రాణం విలవిలలాడుతుంది. ఒక్కసారి రావడం అలవాటు అయితే అదే పనిగా వస్తుంటాయి. దీంతో బాల్కనీ పాడవడమే కాకుండా భరించలేని దుర్వాసన కూడా వస్తుంది. వీటితో కేవలం ఈ సమస్య మాత్రమే కాకుండా ఆరోగ్యం కూడా పాడవుతుందట. ఈ క్రమంలోనే వాటిని తరిమికొట్టేందుకు నెట్స్ పనికొస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.



పావురాల వల్ల వచ్చే సమస్యలు: కపోతాలు ఇంటి బాల్కనీల్లోకి రావడం వల్ల అనేక రకాల సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. పావురాల రెట్టల వల్ల దుర్వాసన వస్తుందని, ఎక్కువ కాలం క్లీన్ చేయకపోతే ఆ ప్రదేశమంతా మచ్చలుగా ఉండిపోతుందని వివరిస్తున్నారు.

పావురాల రెట్టలు వాహనాలపై పడితే అందులో ఆమ్ల స్వభావం వల్ల కార్లు, బైక్‌ల పెయింటింగ్ దెబ్బతినే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. కపోతాల రెట్టల్లో ఉండే సూక్ష్మజీవులు, శిలీంధ్రాలు ఎండిపోయిన తర్వాత గాల్లో కలుస్తాయని, అలాంటి గాలిని పీలిస్తే శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. పావురాల సన్నని ఈకలు ఊపిరితిత్తులకు హానికరం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాలి వెళ్లే మార్గంలో అడ్డుపడటమే కాకుండా, సన్నగా ఉండే ఆక్సిజన్ మెంబ్రేన్ గట్టిగా మారి 'అలర్జిక్ ఆల్వియో లైటిస్' వస్తుందంటున్నారు. ఇక కుటుంబంలో ఎవరికీ ఆస్తమా లేకపోయినా, ఆయాసానికి దారి తీసే 'బర్డ్ ఫ్యాన్సియర్ లంగ్ డిసీజ్' వస్తుందని వివరిస్తున్నారు. ఈ రెండు జబ్బుల వల్ల ఆయాసం, ఊపిరితిత్తుల్లో కఫం పట్టడం, ఇతర ఇన్ఫెక్షన్లు వస్తాయంటున్నారు, అలాగే గుండె సమస్యలకూ దారి తీసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పావురాలు రాకుండా ఉండేందుకు ఏమి చేయాలి: ఒక ప్రాంతాన్ని పావురం సురక్షితమని భావిస్తే ఎన్నిసార్లు తరిమినా మళ్లీమళ్లీ అదే ప్రాంతానికి రావడం ప్రధాన సమస్యగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ సమస్య నుంచి ఉపశమనం పొందేందుకు బర్డ్ నెట్స్ పనికొస్తాయంటున్నారు. అయితే, ఈ నెట్స్ వల్ల బాల్కనీల్లోకి వచ్చే సహజమైన గాలి, సూర్యరశ్మికి ఎలాంటి ఇబ్బంది ఉండదు అంటున్నారు. ఇందులో కూడా పలు రకాలు ఉన్నాయని వివరిస్తున్నారు. పావురాల బెడద లేకుండా, భవనం అందం పోకుండా ఇవి కాపాడతాయని చెబుతున్నారు.

హెచ్‌డీపీఈ నెట్స్: ఇవి అధిక సాంద్రత కలిగిన పాలిథిలిన్ నెట్స్ అని నిపుణులు చెబుతున్నారు. ఎండ, వానకు త్వరగా పాడవకుండా యూవీ స్టెబిలైజ్డ్ కోటింగ్‌తో ఉంటాయని, చదరపు అడుగు ధర రూ.20 నుంచి 35 మధ్యలో ఉంటుందని వివరిస్తున్నారు. అలాగే కనీసం 8 సంవత్సరాలపాటు మన్నికగా ఉంటాయని పేర్కొంటున్నారు.

ట్రాన్స్‌పరెంట్ నైలాన్ నెట్స్(ఇన్విజిబుల్ నెట్స్): ఇవి చూడటానికి సన్నని ఫిషింగ్ నెట్‌లా పారదర్శకంగా ఉంటాయని చెబుతున్నారు. అపార్ట్?మెంట్లకు అమర్చినట్లు దూరం నుంచి చూసినా తెలియదని పేర్కొంటున్నారు. నెట్స్ వల్ల భవనం అందం మారకూడదని భావించేవారికి ఇవి బాగా ఉపయోగపడతాయని వివరిస్తున్నారు. చదరపు అడుగు ధరు రూ.15 నుంచి 25 మధ్య ఉంటుందని, 5 ఏళ్ల పాటు మన్నికగా ఉంటాయంటున్నారు.

రోలర్ పీజియన్ నెట్స్: ఇవి విండో బైండ్స్‌లా పనిచేసే సరికొత్త లగ్జరీ మోడల్ నెట్స్ అని చెబుతున్నారు. అవసరమైనప్పుడు నెట్‌ను కిందకు, గాలి లేదా వ్యూ కావాలనుకున్నప్పుడు పైకి చుట్టేయొచ్చంటున్నారు. ఇవి కేవలం పావురాల నుంచే కాకుండా ఎండ, దుమ్ము, ధూళి నుంచి రక్షణ కల్పిస్తాయని పేర్కొంటున్నారు.

స్టెయిన్‌లెస్ స్టీల్ వైర్ మెష్: ఎలుకులు, కోతులు, పావురాల బెడద ఉన్న భవనాల్లో ఈ మెటల్ నెట్స్ ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి తెగిపోకుండా ఎక్కువకాలం మన్నుతాయని, చదరపు అడుగు రూ.40 నుంచి 60 మధ్యలో ఉంటుందని వివరిస్తున్నారు

# విమానం కలర్ ఫుల్‌గా ఎందుకుండదు? – వెనుక ఇంత కథ ఉందా?

: రోడ్డుమీద దూసుకెళ్లే కార్లు రకరకాల రంగుల్లో ఉంటాయి. అవేకాదు.. బైకులు, బస్సులు సహా దాదాపుగా వాహనాలన్నీ భిన్నమైన కలర్స్‌లో తయారవుతుంటాయి. కానీ, ఒక్క విమానం మాత్రమే తెల్లని రంగులో ఉంటుంది. కేవలం సంస్థ పేరు మాత్రమే అందరికీ కనిపించడం కోసం వేరే రంగులో ఉంటుంది. మరి, ఎందుకు ఇలా? దీనికి గల కారణాలేంటి? అన్నది ఈ స్టోరీలో చూద్దాం. వేసవిలో బ్లాక్ షర్ట్ వేసుకొని ఒకసారి రోడ్డెక్కితే ఎలా ఉంటుంది? ఒళ్లు సుర్రుమంటుంది! అంటే దానర్థం నలుపు సూర్యకాంతిని చాలా వేగంగా అబ్జార్బ్ చేసుకుంటుంది. కానీ, తెలుపు రంగు పూర్తి భిన్నంగా ఉంటుంది. సూర్యుడి వేడిని చాలా తక్కువగా మాత్రమే గ్రహిస్తుంది. విమానానికి తెలుపు రంగు వాడడానికి ఇదొక ప్రధాన కారణం. దీనివల్ల ఫ్లైట్‌కు లాభమేంటి? అంటే, ఒకటి కాదు చాలా ఉన్నాయి. వేరే రంగులు వేస్తే ఎండ వేడిని ఎక్కువగా ఆకర్షిస్తాయి. దాంతో విమానంలో ఉక్కపోత పెరుగుతుంది. కాబట్టి, ఏసీ వాడకం పెంచాల్సి వస్తుంది. తెలుగు రంగు తక్కువగా గ్రహిస్తుంది కాబట్టి.. ఏసీ వాడకమూ తగ్గిపోతుంది. గాల్లో ఎగిరే విమానం భద్రత అత్యంత ముఖ్యం. చిన్నపాటి పగుళ్లు కూడా ఒక రైడ్‌లోనే పెరిగిపెద్దవై ప్రమాదానికి దారితీయొచ్చు. ఈ పగుళ్లు వేరే రంగులో సరిగా కనిపించవు. తెలుపులోనైతే స్పష్టంగా కనిపిస్తాయి. ఆయిల్ లీకేజీ వంటి వాటిని వెంటనే గుర్తుపట్టొచ్చు. ఇక ఎండకు ఇతర రంగులైతే త్వరగా వెలిసిపోతాయి. తెలుపు రంగు ఎక్కువ కాలం ఉంటుంది. దీనివల్ల వెంట వెంటనే పెయింట్ వేసే ఖర్చు తప్పుతుంది. అంతేకాదు, వైట్ పెయింట్ సింగిల్ కోటింగ్ వేసినా సరిపోవచ్చు. కానీ, ఇతర రంగులు చక్కగా కనిపించాలంటే ఒకటి కన్నా ఎక్కువ లేయర్లు వేయాల్సి వస్తుంది. దానివల్ల పెయింట్ ఖర్చు పెరుగుతుంది. అంతేకాదు, విమానం బరువు కూడా పెరుగుతుంది. బరువు పెరిగితే ఇంధనం వినియోగం కూడా పెరుగుతుంది. ఇవన్నీ కలిసి సంస్థ పర్సుకు మరికాస్త చిల్లు పెడతాయి. మరో ముఖ్యమైన విషయం ఉంది. విమానానికి ఎదురయ్యే అతి పెద్ద ప్రమాదం పక్షుల నుంచే! టేకాఫ్ అవుతున్నప్పుడు, ల్యాండ్ అవుతున్నప్పుడు, ఇంకా ఆకాశంలో ఎక్కడైనా సరే పక్షి




ఢీకొంటే చాలా ప్రమాదం. అలాంటి పక్షి నుంచి తప్పించుకోవడానికి కూడా తెలుగు రంగు బాగా ఉపయోగపడుతుందట. ఆకాశంలో దూరం నుంచి ఎదురుగా వస్తున్న విమానాన్ని పక్షులు స్పష్టంగా చూడగలవట. అంతేకాదు, దాన్ని కూడా ఒక పక్షిగా భావించి పక్కకు తప్పుకునే ఛాన్స్ ఉందట. ఇలా ఇన్ని కారణాల వల్లనే విమానానికి తెలుపు రంగు వేస్తారని నిపుణులు చెబుతున్నారు.

# మీకు "వైల్డ్ స్విమ్మింగ్" గురించి తెలుసా?

ఈత కొట్టడం అంటే ఎవరికైనా సరదానే. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ స్విమ్మింగ్ చేయడాన్ని ఇష్టపడతారు. ఇది కేవలం సరదా మాత్రమే కాదు ఎన్నో రకాల ప్రయోజనాలను అందించే గొప్ప పని కూడా. శరీరానికి మంచి వ్యాయామంతోపాటు ఇతరులను రక్షించే సాధనంగా కూడా స్విమ్మింగ్ యూజ్ అవుతుంది. అందుకే చాలా మంది ఈత కొట్టడానికి ఆసక్తి చూపిస్తుంటారు. అయితే, స్విమ్మింగ్ పూల్స్‌తో ఈత కొట్టడంతో పోలిస్తే వైల్డ్ స్విమ్మింగ్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో అనేక రక్షణ చర్యలు పాటించడం మంచిదంటున్నారు. ఈ క్రమంలోనే అసలు వైల్డ్ స్విమ్మింగ్ అంటే ఏమిటి అనే వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.

వైల్డ్ స్విమ్మింగ్? అంటే ఏమిటి? : స్విమ్మింగ్ పూల్స్ కాకుండా నదులు, సరస్సులు, చెరువులు, వాటర్‌ఫాల్స్, సముద్రాల వంటి బహిరంగ జలాశయాలలో ఈత కొట్టడాన్ని 'వైల్డ్ స్విమ్మింగ్' అంటారని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల ఈ స్విమ్మింగ్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోందని.. అయితే ఇలా సహజ వనరుల్లో స్విమ్మింగ్ వల్ల లాభాలతోపాటు నష్టాలూ ఉంటాయంటున్నారు.

వ్యాయామంతోపాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడటం, ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో మురుగు నీరు, నాచు, జంతువుల మూత్రం నీటిలో కలయిక, విష వ్యర్థాలవల్ల నీరు కలుషితమై వ్యాధులకు అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇన్‌ఫెక్షన్లు పెరిగే ప్రమాదం: వర్షాకాలంలో భారీగా వరదలు వచ్చినప్పుడు వైల్డ్ స్విమ్మర్లలో ఇన్‌ఫెక్షన్ ఆధారిత వ్యాధులు పెరిగే అవకాశముంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈత కొట్టినప్పుడు నీటిని అధికంగా మింగినవారు మరింత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవచ్చని, వారికి ఉదరకోశ వ్యాధులతో పాటు డయేరియా, కడుపు నొప్పివంటివి వస్తాయంటున్నారు.

పిల్లలకు ముప్పెక్కువ: సహజ నీటి వనరుల్లో ఈత కొట్టడం.. పెద్దలతో పోలిస్తే పిల్లలకు అధికంగా ముప్పును కలిగిస్తుందని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే వారు అధికంగా నీటిని మింగుతారని చెబుతున్నారు.

ఇవి తెలుసుకోవాలి:

భారీ వర్షం కురిసిన 24 గంటల నుంచి 72 గంటల మధ్య పట్టణ ప్రాంతాల్లోని నదులు ఈత కొట్టడానికి అనుకూలంగా ఉండవంటున్నారు నిపుణులు. దీనికి కారణం.. మురుగు నీరు ఓవర్ ఫ్లో కావడం, అవశేషాలు కదలడమే అని చెబుతున్నారు.

అతి భారీ వర్షాలతో నదులు, వాగులు ఓవర్ ఫ్లో అవుతాయని, ఆ సమయంలో కంపెనీలు.. మురుగు, కాలుష్య వ్యర్థాలను విడుదల చేస్తుంటాయి. ఇదంతా నేరుగా ప్రవాహాల్లోకి వస్తుందంటున్నారు.

ఇక సాగు చేసే ప్రాంతాల్లో వర్షాలకు ఆవు పేడ, మట్టి.. నదులు, వాగుల్లోకి కొట్టుకుపోతుందని, దీనివల్ల సయనోబ్యాక్టీరియా వృద్ధికి అవకాశముందంటున్నారు.

ఏం చేయాలి:

నీటిలో నాచు అధికంగా ఉన్నప్పుడు ఈత కొట్టకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే నీరు పారదర్శకంగా కాకుండా ఆకుపచ్చగా, చిక్కటి ఆకుపచ్చగా ఉంటే దూరంగా ఉండాలని చెబుతున్నారు.

నురగలు, తేలియాడే బుడగలు, మురికి పొరలు కనిపిస్తే ఈత కొట్టకూడదని వివరిస్తున్నారు.

భారీ వర్షాలు కురిసినప్పుడు స్విమ్మింగ్ చేయకూడదని, రసాయనాల వాసన ఉన్నా, చనిపోయిన చేపలు కనిపించినా ఆ నీటిలో దిగకూడదంటున్నారు.

ఇమ్యూనిటీ వ్యవస్థ బలహీనంగా ఉన్నవారు, అనారోగ్యంగా ఉన్నవారు, గాయాలతో ఉన్నవారు వైల్డ్ స్విమ్మింగ్ చేయకూడదని చెబుతున్నారు.



## టెలిస్కోప్ తో కళ్ల ముందే 'విశ్వం'!

### రూ.2 వేలకే చిన్నారుల దగ్గరకు 'చందమామ'!



రాత్రిపూట ఆకాశం వైపు చూస్తే మిణుకు మిణుకుమనే నక్షత్రాలతో పాటు అనంతమైన నిశీధి కనిపిస్తుంది. ఆ చీకటి పొరల వెనక ఏముంది? ఆ ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో మనిషి కనుగొన్న సాధనమే 'టెలిస్కోప్'. మనకు ఆసక్తి ఉంటే, దాన్ని ఇంట్లోనే పెట్టుకోవచ్చు. రోజూ విశ్వాంతరాళాన్ని వీక్షించవచ్చని చెబుతున్నారు ఖగోళ నిపుణులు. నక్షత్రాల పరిశోధన అనగానే అది కేవలం నాసా, ఇస్రో శాస్త్రవేత్తలకే పరిమితం అనుకోనక్కర్లేదు. కాస్త ఆసక్తి ఉంటే చాలు సామాన్యులూ విశ్వపు అందాలను కళ్లారా వీక్షించొచ్చు అంటున్నారు. టెలిస్కోప్ కటకం లేదా అద్దం వ్యాసం ఎంత పెద్దగా ఉంటే అంత ఎక్కువ కాంతిని గ్రహించి, స్పష్టమైన ఇమేజ్ ఇస్తుందని చెబుతున్నారు. దీనిపైనే టెలిస్కోప్ సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. మరి, ఎవరికి ఏ టెలిస్కోప్ బెటర్? అమరిక ఎలా ఉండాలి? ఏ సమయంలో చూస్తే మంచిది? వంటి వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

చిన్నారులకు :

పిల్లలకు టెలిస్కోప్ ద్వారా విశ్వాన్ని పరిచయం చేయవచ్చు. 6 నుంచి 12 సంవత్సరాల వయసున్న పిల్లలకు బేసిక్ రిఫ్రాక్టర్ టెలిస్కోప్(50–70 ఎంఎం కటకం) ఇస్తే చాలు. చందమామపై ఉన్న మచ్చలను దగ్గరగా చూసి వారు పొందే ఆనందం అంతాఇంతా కాదు. వీటి ధర వచ్చేసి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఉంటుంది.

యువత అన్వేషణ కోసం :

ఖగోళంపై మక్కువ ఉన్న వారు కాస్త పెద్దదైన రిఫ్లెక్టర్ (న్యూటోనియన్) మోడల్స్ వాడొచ్చు. ఇవి రూ.10 వేల నుంచి రూ.16 వేల మధ్యలో లభిస్తాయి. శనిగ్రహం చుట్టూ ఉండే అందమైన వలయాలు, గురుగ్రహం చుట్టూ తిరిగే ఉపగ్రహాలను ఈ రకమైన టెలిస్కోప్ ద్వారా స్పష్టంగా చూడొచ్చంటున్నారు నిపుణులు.

స్మార్ట్ యుగం :

ఒకప్పుడు ఏ గ్రహం ఎక్కడ ఉందో వెతికి మరీ కంటితో వీక్షించాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు 'ఈవీ స్కోప్' లాంటి ా× ఆధారిత స్మార్ట్ టెలిస్కోప్?లు వచ్చేశాయి. యాప్?లో సెట్ చేస్తే చాలు. టెలిస్కోప్ నుంచి నేరుగా మన మొబైల్?కే ఫొటోలు పంపుతాయి. ఈ హైఎండ్ టెలిస్కోప్ ధరలు వచ్చేసి రూ.2.50 లక్షల నుంచి మొదలై రూ.15 లక్షల వరకు ఉంటాయి. మన దేశంలో సెలెస్ట్రాన్, తేజరాజ్ అండ్ కో లాంటి సంస్థలు వీటిని, వీటికి సంబంధించిన స్పేర్ పార్ట్స్?ను అందుబాటులో ఉంచాయి.

ఇలా సెట్ చేసుకుంటే మంచిది :

టెలిస్కోప్ ఉండగానే సరిపోదు దాని అమరిక కూడా కీలకం అని చెబుతున్నారు నిపుణులు. టెలిస్కోప్ కొన్న వెంటనే ఆకాశం వైపు తిప్పేస్తే ఏమీ కనిపించదు. ముందుగా దూరంగా ఉన్న ఒక వస్తువును (కొండపై ఉన్న ఆకారం లేదా సెల్ టవర్ లాంటిది) టార్గెట్ చేసి వ్యూవర్, మెయిన్ కటకాన్ని ఒకే లైన్?లో ఉండేలా సెట్ (అలైన్) చేసుకోవాలి.

ఒకసారి ఫోకస్ కుదిరిందంటే ఇక రాత్రి పూట చుక్కల వేట ఈజీ అవుతుంది. టెలిస్కోప్ చూసేటప్పుడు స్టాండ్ (ట్రైపాడ్) ఏమాత్రం కదలకుండా దృఢంగా ఉండాలి. చిన్న వైబ్రేషన్ వచ్చినా ఇమేజ్ బ్లర్ అయిపోతుందని గుర్తుంచుకోవాలి. ఫొటోగ్రఫీ చేయాలనుకుంటే ఆకాశం కదిలే కొద్దీ ఆటోమేటిక్?గా తిరిగే 'ఈక్వటోరియల్' మౌంట్ కావాలి.

నార్మల్?గా టెలిస్కోప్?తో పాటే స్టాండ్ కూడా వస్తుంది. మరో 5 లెన్స్ కూడా ఇస్తారు. అవసరాన్ని బట్టి లూనార్, సోలార్ ఫిల్టర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మార్కెట్లో వీటి ధర వచ్చేసి రూ.5 వేల నుంచి 10 వేల రూపాయల వరకు ఉంటుంది. ఇతర కాంతిని ఫిల్టర్ చేసే హెచ్–ఆల్ఫా ఫిల్టర్లు కూడా మార్కెట్లో లభిస్తున్నాయి.

సాధారణ టెలిస్కోప్?తో పాటు వచ్చే యూజర్ గైడ్, మాన్యువల్ లేదా వీడియోలను చూసి వినియోగదారులే ఇన్?స్టాల్ చేసుకోవచ్చు. ఖరీదైన వాటికి మాత్రం సంస్థ ప్రతినిధులు వచ్చి ఇన్?స్టలేషన్ చేసి చూపిస్తారు.

ఏ సమయంలో చూడాలి?

కాంతి కాలుష్యం లేని చీకటి ప్రదేశాల్లో, ముఖ్యంగా రాత్రి 7 దాటిన తర్వాత వాతావరణం వీక్షణకు అత్యంత అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు ఖగోళ నిపుణులు.

సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయ సమయాల్లో బుధుడు, శుక్రుడులాంటి గ్రహాలు అద్భుతంగా దర్శనమిస్తాయి.

పగటిపూట సూర్యుడిని అధ్యయనం చేయాలంటే కచ్చితంగా ప్రత్యేకమైన 'సోలార్ ఫిల్టర్లు' వాడాల్సిందే! ఫిల్టర్లు లేకుండా నేరుగా సూర్యుడి వైపు చూస్తే కళ్లు శాశ్వతంగా దెబ్బతింటాయి.

పౌర్ణమి నాడు వెన్నెల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఆ సమయంలో జాబిల్లిని చూసేందుకు 'లూనార్ ఫిల్టర్స్' వాడటం సురక్షితం.

ఇప్పుడు మార్కెట్లో టార్ ట్రాకర్, స్కైవాచర్, సెలెస్ట్రాన్, బ్రెస్సర్, డ్వార్ఫ్ ల్యాబ్, ఎస్వీ బోనీ తదితర ప్రముఖ కంపెనీల టెలిస్కోప్?లు అందుబాటులో ఉన్నాయి. కాస్త ఆసక్తి, ఓపిక ఉంటే, ఒక పీవీసీ పైపు, ప్రైమరీ, సెకండరీ మిర్రర్స్ ఆన్?లైన్?లో కొనుగోలు చేసి మనమే సొంతంగా టెలిస్కోప్ (న్యూటోనియన్ రిఫ్లెక్టర్ మోడల్) తయారు చేసుకోవచ్చంటున్నారు.

అనంత విశ్వాన్ని చూపే టెలిస్కోప్?ను మన కంటిపాపలా చూసుకోవాలి. దీనిలోని ప్రైమరీ, సెకండరీ అద్దాలు చాలా సున్నితం. వాటిపై దుమ్ము పడిందని పొడి వస్త్రంతో గట్టిగా తుడిచేస్తే గీతలు పడతాయి. దానివల్ల కాంతి చెదిరిపోయి క్లారిటీ తగ్గుతుంది. నిపుణుల సూచన మేరకు క్లీన్ చేయడం మంచిది.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ బాధితులకు అండగా ఉంటాం

**మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ**

**కేంద్ర పర్యావరణ మరియు అటవీ శాఖ మంత్రి భుపేందర్ యాదవ్ తో భేటీ అనంతరం వినతి పత్రం అందజేత**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04, షాద్నగర్ ప్రతినిధి :** సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ నేడు కేంద్ర పర్యావరణ మరియు అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తో భేటీ అయ్యారు. అనంతరం డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై సుదీర్ఘమైన చర్చలు జరిపి జీవో నెంబర్ 641 రద్దు చేయాలని కోరారు. మరియు వినతిపత్రాన్ని అందజేశారు.

**వినతిపత్రంలో పొందుపరిచిన విషయాలు:**
ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 641 ద్వారా సిద్దాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 252, 278, 361లలో గల 86.00 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ స్థలంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి 'హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కు అనుమతులు మంజూరు చేశారని వివరించారు. అయితే, గతంలో ఇదే భూమిని "ఇకో-టౌన్" ప్రాజెక్ట్ కోసం ప్రతిపాదించారని కేంద్ర మంత్రికి ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు. జీవో 111 నిబంధనలను సైతం ఉల్లంఘించి పర్యావరణానికి ముప్పు కలిగించే విధంగా చేస్తున్నారని పేర్కొన్నారు.

**తాగునీటి వనరులకు ప్రమాదం:**
ఈ ప్రతిపాదిత వ్యర్థాల ప్లాంట్ ఉన్న ప్రాంతం చుట్టుపక్కల దాదాపు 50 గ్రామాలు జీవో ఎంఎస్ నెం. 111 (1996) పరిధిలోకి వస్తాయని. ఈ జీవో ప్రకారం హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కాలుష్య కారక పరిశ్రమలు లేదా తదితర యాక్టివిటీస్ చేపట్టకూడదని ఉన్న నిబంధనలు వివరించారు.

**ప్రజల ఆరోగ్యంపై ప్రభావం:**
ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ లేదా వ్యర్థాల ప్లాంట్ ప్రారంభిస్తే, భూగర్భ జలాలు కలుషితమై ప్రజల తాగునీరు, ఆరోగ్యం మరియు జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారని. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్లాంట్ ఏర్పాటుపై సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ (2016) మరియు ఈఐఏ



నోటిఫికేషన్ (2006) నిబంధనల ప్రకారం పునఃసమీక్ష జరపాలని డీకే అరుణ కోరారు. అలాగే, స్థానిక ప్రజల అభిప్రాయాలను మరియు అభ్యంతరాలను స్వయంగా వినడానికి సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తో ఒక ప్రత్యేక తనిఖీ కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. స్థానిక రైతులు, ప్రజల ఇబ్బందులను, ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కన్నులపండుగగా ప్రారంభమైన దుర్గమ్మ జాతర, ఆషాఢ బోనాల మహోత్సవాలు

**అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలి : నీలం మధు ముదిరాజ్.**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04 :** మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పండుగ ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో, వైభవంగా ప్రారంభమైంది. గ్రామ దేవతల అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ఊరంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రతి ఇల్లూ పసుపు, కుంకుమలు, తోరణాలతో శోభాయమానంగా మారింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే దుర్గమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నీలం మధు ముదిరాజ్ భారీ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నాలుగు రోజుల ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా మొదటిరోజు మంగళవారం గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. కట్టమైసమ్మ జాతరతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని, గ్రామ దేవత కట్టమైసమ్మ తల్లికి పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి,



మంగళహారతులు పట్టి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. రెండవ రోజైన బుధవారం దుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దివ్య దర్శనం కల్పిస్తున్నారు. మూడవ రోజు గురువారం పోచమ్మ జాతర జరగనుంది. ఈ రోజున గ్రామప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి, తమ కష్టాలను తీర్చి కుటుంబాలను చల్లగా చూడాలని ఆ వేడుకల ద్వారా అమ్మవారిని ప్రార్థించనున్నారు. ఉత్సవాల్లో నాల్గవ రోజు శుక్రవారం దుర్గమ్మ బోనాల పండుగ అత్యంత వైభవంగా జరగనుంది. గ్రామ ఆడపడుచులు



ఆధ్యాత్మిక నిష్టతో, భక్తిప్రపత్తులతో బోనాలను శిరస్సున ధరించి, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకోనున్నారు. బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల అనేక గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించే ఈ ఉత్సవాలలో భక్తులందరూ విశేషంగా పాల్గొని, అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పొంది, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో 'వాట్సాప్' సంచలన నిర్ణయం.. యూజర్లకు ఇక 'ఏజ్ ప్రాంప్ట్'

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, సెంట్రల్ డెస్క్:** దేశవ్యాప్తంగా ఉన్న వాట్సాప్ యూజర్లకు యాప్ ఓపెన్ చేయగానే తమ ఏజ్, డేట్ ఆఫ్ బర్త్ ధ్రువీకరించాలనే కొత్త ప్రాంప్ట్ కనిపిస్తోంది. ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఇలా ఉన్నట్టుండి యూజర్ల వయస్సును ఎందుకు అడుగుతోందోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే, దాని వెనుక కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నియమ నిబంధనలు ఉన్నాయి.

**'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్'ఎఫెక్ట్..**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ నియమాలకు కట్టుబడేందుకు మెటా సంస్థ ఈ చర్యలు చేపట్టింది. ఈ చట్టం ప్రకారం.. సోషల్ మీడియా, మెసేజింగ్ వేదికలు 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న మైనర్ల డేటాను




సేకరించడంపై, వారి లక్ష్యంగా ప్రకటనలు ఇవ్వడంపై ఆంక్షలు ఉంటాయి. అయితే, డి పి డి పి చట్ట నిబంధనల ప్రకారం, 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలు వాట్సాప్, ఇతర మెటా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించాలంటే వారి తల్లిదండ్రులు, సంరక్షకుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేశారు. యూజర్ల వయస్సును స్పష్టంగా తెలుసుకోవడం ద్వారా మాత్రమే మైనర్లను గుర్తించి, వారికి అనుగుణంగా సెక్యూరిటీ, ప్రైవసీ ఫీచర్లను అమలు చేసే అవకాశం ఉంటుంది.

**యూజర్ డేటా భద్రమేనా.. అని టెన్షన్:**
అయితే, చాలామంది యూజర్లు తమ డేట్ ఆఫ్ బర్త్‌ను వాట్సాప్‌తో షేర్ చేసుకోవడానికి కాస్త వెనుకడుగు వేస్తున్నారు. వయస్సు వివరాలను కేవలం చట్టపరమైన నిబంధనల కోసమేనని, యూజర్ల వయస్సును నిర్ధారించి డివైడ్ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తామని, ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ కారణంగా యూజర్ల వ్యక్తిగత మెసేజ్‌ల భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని 'మెటా' ఫుల్ క్లారిటీ ఇచ్చింది.

# చదువు లేనోడివి నీకు విద్యాశాఖ ఎందుకు?.. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అర్వింద్ ఓపెన్ చాలెంజ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, తెలంగాణ బ్యూరో :** ఇతరుల సహాయం లేకుండా ఎన్నికల నామినేషన్ పత్రం నింపలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ విద్యార్థుల గురించి మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. రెండో వ్యక్తి సహాయం లేకుండా నామినేషన్ పత్రం నింపగలవా అని సీఎంకు అర్వింద్ ఓపెన్ చాలెంజ్ విసిరారు. చదువు లేని రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖను పెట్టుకోవడానికి సిగ్గులేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి తన వద్ద ఉన్న విద్యాశాఖను శ్రీధర్ బాబు లాంటి చదువుకున్న వారికి అప్పగించాలన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన, ఆయన ఇస్తున్న స్టేట్?మెంట్లు అన్నీ తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేవిధంగా ఉన్నాయని దుయ్యబట్టారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన అర్వింద్.. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు ఇదే రకంగా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మీ మాటలతో ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా?**
65 శాతం క్లాసులు విని పరీక్షలు రాసి పాసైన ఇంజనీరింగ్ విద్యార్థులకు అప్లికేషన్ ఫామ్?లు నింపడం రాదని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఒక రాష్ట్రంలో అత్యధికంగా ఇంజినీరింగ్?లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అలాంటి విద్యార్థుల భవిష్యత్?ను రేవంత్ రెడ్డి ఏం చేయదలుచుకున్నారని ప్రశ్నించారు. సీఎం ఈ రకంగా మాట్లాడితే మన ఇంజనీరింగ్ పిల్లలకు ఎవరైనా ఉద్యోగాలు ఇస్తారా? ఇప్పుడు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ఏంటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు అదే కార్యక్రమంలో ఉన్న ఉపాధ్యాయులు చప్పట్లు కొట్టడం కూడా చాలా తప్పన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆడబిల్లలకు టాయిలెట్స్ లేని స్కూల్స్ ఉన్నాయన్నారు. ఉన్న స్కూల్స్ బాగు చేయకపోయినా కమిషన్ల కోసం కొత్త స్కూల్స్ కడుతామంటున్నారని మండిపడ్డారు. టీచర్ల పీఆర్సీ ఇవ్వని ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల బాగోగుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ ఇప్పటికీ ప్రతిపక్ష నేతగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

**తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా?**
గతంలో తాము ఎక్కడికైనా వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లేవారు వచ్చినట్లు మమ్మల్నీ చూస్తున్నారని ముఖ్యమంత్రి మాట్లాడారని అలా మాట్లాడితే ఎవరైనా పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారా అని నిలదీశారు. నువ్వేం ముఖ్యమంత్రివి? తమాషాలు చేస్తున్నావా? లేక టైమ్ పాస్ చేస్తున్నావా? అని మండిపడ్డారు. చదివినోళ్లకు చదవనోళ్లకు ఫ్యూచర్ లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. మరో వైపు హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ పూర్తిగా నాశనం పట్టించారని ఓ వైపు కోర్టు చీవాట్లు పెడుతుంటే రేవంత్ రెడ్డి ప్రొటెక్ట్ చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులకు దోచిపెడుతున్నాడని ఆరోపించారు.






## అంగరంగ వైభవంగా పంద్రాగస్టు వేడుకలు : ఎమ్మెల్యే జి.ఎం.ఆర్

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04 :** రానున్న స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో అంగరంగ వైభవంగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహిస్తున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో వేడుకలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే సంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్ ఫాస్ట్, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే ప్రతి పాఠశాలకు ఐదు వేల రూపాయల నగదు బహుమతి తో పాటు, ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలలకు 20 వేలు, 15 వేలు, 10 వేల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర ఘట్టాలను, సంస్కృతిని మరిపించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

## ఆర్.సీ పూర్ ఈఎస్ఐలో ఘనంగా బోనాల వేడుక

**అమ్మవారి మంత్రోచ్చారణతో మార్మోగిన ప్రాంగణం**

**ఆకట్టుకున్న వేదపండితుడీ విన్యాసాలు.**





**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04 :** ఆషాడ మాసం ప్రారంభమైందంటే చాలు తెలంగాణలోనీ పల్లే, పల్లి, వాడ, వాడా మైసమ్మ నామోచ్చచారణ, భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఇక శివసత్తుల వాణి, పోతురాజుల విన్యాసాలు తెలంగాణ విశిష్టతకు ప్రతిబింబం. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలోని మైసమ్మ తల్లి అమ్మవారి దేవాలయంలో వేద పండితుడు అరవింద్ స్వామి మంత్రోచ్ఛారణ, అమ్మవారికి ఇష్టమైన ప్రత్యేక నృత్యంతో భక్తులందరినీ అలరించి, మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ.ఎస్.ఐ వైద్యాధికారి, డాక్టర్ రమేష్ బాబు పర్యవేక్షణలో ఈఎస్ఐ ఆసుపత్రి సిబ్బంది పాల్గొనగా మైసమ్మ బోనాలను ఈఎస్ఐ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న రోగులతో పాటు వారి బంధువులు అమ్మవారి విశేష పూజలో పాల్గొని తరించారు.

## నూతన ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసిన గురుజువాడ గ్రామ సర్పంచ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఉమాదేవి ని గురుజువాడలో గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ, ఉమాదేవి మండల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా రాణించాలని శుభాభినందనలు ఈ సందర్భంగా ఎంపీవో వెంకటరెడ్డి సూపరిండెంట్ అంజయ్య తదితరులు ఉన్నారు.

# వ్యసన విముక్త "భారతావని" కై కృషి చేద్దాం

**మాదకద్రవ్యాల నిర్మూలనకై బ్రహ్మాకుమారీలు చేస్తున్న సేవలు అభినందనీయం**

**కృషి ఐటిఐలో జరిగిన అవగాహన సదస్సులో భువనగిరి సిఐ అర్జున్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన భారతావనిని ఎలాంటి దురలవాట్లు లేని దేశంగా పునర్ నిర్మించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందని భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యేశమోని అర్జున్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం మరియు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నశాముక్త భారత్ 10 కోట్ల ప్రతిజ్ఞల మెగా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని స్థానిక కృషి ఐటిఐ క్యాంపస్లోని దరిపల్లి అనంత రాములు ఆడిటోరియం హాల్లో ఆయన మంగళవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఈరోజు మనం తీసుకునే మంచి నిర్ణయాలే రేపటి భవిష్యత్తుకు ఆధారమని తెలిపారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు, వ్యయ ప్రయాసలకు ఓర్చి తమ పిల్లల బంగారు భవిష్యత్తుకై కళాశాలలకు పంపుతున్నారని వారి కలలు సాకారం చేయడానికి విద్యార్థులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన జీవితం భవిష్యత్తును ఉజ్వలంగా మారుస్తుందని తెలిపారు. సరదా కోసమని కొంతమంది సిగరెట్, గుట్కా, తంబాకు, డ్రగ్స్, గంజాయి, తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, సరదా కోసం చేసే తప్పులు సరిదిద్దుకోలేని తప్పులు గా మారి జీవితాలు చీకటిమయం కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈరోజుల్లో ఎక్కడ చూసినా ప్రతి ఒక్కరూ హక్కుల కోసమే మాట్లాడుతున్నారు తప్ప హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తెరిగి ప్రవర్తించాలని కోరారు. విశ్వశాంతికై ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందని, ఈ సంస్థ



చూపించే శాంతి మార్గం అనుసరణీయమని, మాదకద్రవ్యాల నిర్మూలనకు, వ్యసన విముక్తికై సంస్థ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భువనగిరి పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ కర్నాటి లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ... విద్యార్థులు మహనీయులు చూపిన మార్గంలో నడవాలని, ఉత్తమ విద్యతో పాటు ఉత్తమ గుణాలను అలవర్చుకున్నప్పుడే చరిత్రవంతులుగా కాగలరని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. మంచి అలవాట్లు ఉన్న వ్యక్తులను స్నేహితులుగా ఎంచుకోవాలని చెడు వ్యసనాలు ఉన్న వ్యక్తుల స్నేహం చేసి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. కొంతమంది ప్రలోభాలకు ప్రేరేపితమై చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి కోర్టు కేసుల నేపథ్యంలో ఉన్నత ఉద్యోగ అవకాశాలను కోల్పోయిన ఉదంతాలను వివరించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం భువనగిరి ఇంచార్జ్ చంద్రావతి అక్కయ్య మాట్లాడుతూ భారత ప్రభుత్వం బ్రహ్మకుమారి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వ్యసన విముక్తికై 10 కోట్ల మంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్నామని ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సత్య యుగంలో నరుడు నారాయణునిగా నారీ శ్రీ మహాలక్ష్మిగా ఉండేదని అలాంటి దైవీ గుణాలను అందరిలో పెంపొందించి భారత్ ను స్వర్ణిమ భారత్ గా మార్చడానికి బ్రహ్మకుమారీస్ సంస్థ అహర్నిశలు పాటుపడుతుందని తెలిపారు. రావణ దహనం అంటే బొమ్మను కాల్చడం కాదని ప్రతి ఒక్కరిలో






ఉన్న కామం, క్రోదం, లోభం, మోహం, అహంకారం, మద్యం, జూదం, సిగరెట్, తంబాకు, గుట్కాలాంటి దుర్గుణాలని వీటిపై ఎవరికివారుగా విజయం సాధించినప్పుడే నిజమైన రావణసంహారం జరుగుతుందని తెలిపారు. కృషి ఐటిఐ, వాత్సల్య విద్యా సంస్థల కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు గురువులు చూపిన మంచి మార్గంలో పయనించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా బుద్ధులతో పాటు నైతిక విలువల శిక్షణ తరగతులను కూడా నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీ వాగ్దేవి జూనియర్ అండ్ ఒకేషనల్ కళాశాల అధ్యాపకులు కొలను శ్రావణ్ రెడ్డి, వీరయ్య మరియు విద్యార్థులు, వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, మహేందర్ మరియు విద్యార్థులు కృషి ఐటిఐ అధ్యాపకులు నామోజు రమేష్, చామకూర శ్యామ్ కుమార్ మరియు గుమ్మిడెల్లి రమేష్ విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వ్యసన విముక్తా భారతావనికై కృషి చేస్తాం అని ప్రతిజ్ఞ చేశారు. ఐశ్వర్య బ్రహ్మకుమారిస్ సంస్థ నుండి బికె బాలేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బికె చారి, బికె రామేశ్వర్, బికె జహంగీర్ కుమార్, బికె అరుణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భవాని టైల్స్ షాప్ సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచందర్ నాయక్



**తొర్రూర్, హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04 :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని పాల కేంద్రం వద్ద జాటోత్ స్వామి కి చెందిన శ్రీ భవాని టైల్స్ షాప్ ను డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్, ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యాపారంలో అన్ని వర్గాల వారు పట్టుదాలతో కృషి చేస్తే ఫలితం బాగుంటుంది అని మంచి భవిషత్తుకై వ్యాపారం నిబద్ధతతో సామాన్యులకు ప్రజలకు చేరువయ్యేలా ఉండాలని కోరారు. వారి వెంట గిరిజన సామజిక వేత్త జాటోత్ సాయి కృష్ణ, డాక్టర్ శంకర్, డాక్టర్ వెంకన్న స్వామి నాయక్, దంతలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు నాయక్, శ్రీనివాస గార్డెన్ చైర్మన్ గోపారాపు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దంతాలపల్లి ఎస్సై ను వెంటనే సస్పెండ్ చెయ్యాలి

**దళిత సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్.**



**దంతలపల్లి, హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04,**
దంతాలపల్లి మండలంలో అంగన్వాడి సెంటర్ లో జరిగిన ఘటన కేసు పెట్టాలని వెల్లిన ఇద్దరు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి బెదిరింపులకు పాల్పడి అవమానపరిచిన దంతాలపల్లి ఎస్సై ను వెంటనే సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నాయకులు మంద యాకమల్లు మాదిగ, ఎస్సీ జన సంఘం రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్, విజయేందర్, దళిత కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు మద్దిరాల పరశురాం, తదితరులు దంతాలపల్లిలో మాట్లాడుతూ దురుసు స్వభావంతో ప్రవర్తిస్తూ ప్రజల సేవకుడిగా కాకుండా అధికార మదంతో పోలీస్ స్టేషన్ కు వచ్చిన ప్రతి ఒక్కరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న దంతాలపల్లి ఎస్సై ని ప్రభుత్వం వెంటనే రిమూవ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళలను బెదిరించి గద్దించడంతో అంగన్వాడీ టీచర్ భయంతో స్పృహ కోల్పోయి కిందపడిపోవడంతో ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఇలాంటి ఘటనలు జరిగినా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చెంచలి వెంకన్న, మధిరాల లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరులపై దుర్భాషలాడిన అంగన్వాడీ టీచర్ కు మెమో జారీ చేసిన సిడిపివో

**అంగన్వాడి కేంద్రం తనిఖీకి వచ్చిన సిడిపివో ముందే విలేకరులపై దుర్భాష.**

**జిల్లా కలెక్టర్ కు నివేధిక అందిస్తామని చెప్పిన సిడిపివో..**

**తొర్రూర్, హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04 :** మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన రెండో అంగన్వాడి కేంద్రానికి తాళం వేసి ఉండి సమయపాలన పాటించడం లేదంటూ మంగళవారం పలు దినపత్రికలలో వచ్చిన వార్తలకు స్పందించిన సిడిపివో రేష్మ సంబంధిత అధికారులతో అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సమయపాలన పాటించని అంగన్వాడి కేంద్రంపై సిడిపివో రేష్మ అధికారులతో కలిసి తనిఖీకి వెళ్లడంతో విషయం తెలుసుకున్న పత్రిక విలేకరులు అంగన్వాడి కేంద్రానికి వెళ్లారు. అంగన్వాడి కేంద్రానికి ఎందుకు వచ్చారు అంటూ అంగన్వాడీ కేంద్రం టీచర్ రంగు అంభిక విలేకరులపై దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడింది. ఎందుకు వచ్చారంటూ నేను కూడా అంగన్వాడి టీచర్ జాబుకు రిజైన్ చేసి మీ అంతు చూస్తా.. అంటూ తనిఖీకి వచ్చిన సిడిపివో ఎదుటే బెదిరింపులకు పాల్పడింది. దీంతో పత్రికా విలేకరులు సమస్యలపై వార్తలు రాయొద్దా అంటూ అంగన్వాడీ టీచర్ అంభికను అడగడంతో, ఆమె విలేకరులను



ఇష్టానుసారంగా దూషించింది. అంగన్వాడి కేంద్రానికి తనిఖీకి వచ్చిన సిడిపివో నీకేం అవసరం అంటూ అంగన్వాడి టీచర్ పై ఆగ్రహించింది. అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి నిజా నిజాలను తెలుసుకొని అంగన్వాడీ టీచర్ రంగు అంభిక, ఆయా కవితకు మెమోలను జారీ చేసింది. జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్ కు తెలపడం జరుగుతుందని, ఘటనపై మూడు రోజులలో వివరణ ఇవ్వాలని అంగన్వాడీ టీచర్, ఆయకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని సిడిపివో తెలిపారు.

# 65 ఏళ్ల విద్యా సేవకు నిదర్శనం...శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్

**బ్లూ సఫైర్ జూబ్లీ వేడుకలకు సిద్ధం**

**ఆగష్టు 04, హైదరాబాద్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** విద్యా రంగంలో 65 సంవత్సరాల విశిష్ట సేవలను పూర్తి చేసుకున్న శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ (ఎస్ఎస్జీఐ) తన బ్లూ సఫైర్ జూబ్లీ (1961--2026) వేడుకలను ఆగస్టు 3 ఘనంగా నిర్వహించింది. విద్యా నాణ్యత, విలువల ఆధారిత బోధన, నాయకత్వ వికాసం, సమాజ సేవలో ఆరు దశాబ్దాలకు పైగా అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి తెలిపారు. ఈ చారిత్రాత్మక వేడుకల్లో దేశానికి సేవ, నాయకత్వం మరియు యువతకు స్ఫూర్తినిచ్చే ఇద్దరు ప్రముఖులు పాల్గొననున్నారు. వారు కూడా శివ శివాని సంస్థ విద్యార్థులు గర్వ కారణం అని సంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి తెలిపారుభారత సైన్యంలో విశిష్ట సేవలందించిన కల్నల్ గౌరవ్ దత్తా (విరమణ పొందిన) గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. యుద్ధభూమిలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన కల్నల్ గౌరవ్ దత్తా (రిటైర్డ్) ట్రైయాథ్లాన్ ఛాంపియన్‌గా కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కల్నల్ గౌరవ్ దత్తా (రిటైర్డ్) మాట్లాడుతూ, శివశివాని నా జీవితంలో ఒక విద్యాసంస్థ మాత్రమే కాదు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన ఆలయం. సైన్యంలో నేర్చుకున్న ధైర్యం, నాయకత్వం, క్రమశిక్షణకు ఇక్కడ పొందిన విలువలే బలమైన పునాది. నేటి విద్యార్థులు సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదలతో కూడిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని అయన పేర్కొన్నారు. విద్యా సంస్థ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి ఆరతి సంపతి మాట్లాడుతూ, గత 65 సంవత్సరాలుగా శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వేలాది మంది విద్యార్థులను విద్య, విలువలు, నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్ది దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దిందని తెలిపారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత, వృత్తిపరమైన విద్య వరకు నాణ్యమైన విద్యను అందిస్తూ సంస్థ విశిష్ట గుర్తింపు పొందిందన్నారు. గత ఆరు దశాబ్దాలుగా శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ విద్యార్థుల్లో విద్యా ప్రావీణ్యం, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణాత్మక దృక్పథం మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తూ వేలాది మంది విజయవంతమైన పూర్వ విద్యార్థులను సమాజానికి అందించింది అని అన్నారు. విద్యా సంస్థ వైస్ ప్రెసిడెంట్ డా. శైలేష్ సంపతి మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ప్రపంచ స్థాయి విద్య, విలువలతో కూడిన నాయకత్వం, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దేందుకు శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కట్టుబడి ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సంస్థపై ఉంచిన అపారమైన విశ్వాసం, ఆదరణతో నేడు శివశివాని గ్రూప్ ఒకే క్యాంపస్‌లో రెండు డిగ్రీ కళాశాలలు, ఒక పాఠశాల, ఒక జూనియర్ కళాశాల (ఇంటర్), అలాగే మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కేజీ (కేజీ ) నుంచి పీహెచ్‌డీ (పీహెచ్డీ ) వరకు సమగ్ర విద్యను అందిస్తున్న అరుదైన విద్యాసంస్థల్లో శివశివాని ఒకటిగా నిలిచిందని ఆయన తెలిపారు. విద్యా సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి దీపికా సంపతి మాట్లాడుతూ, 1961లో స్థాపితమైన శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ గత 65 సంవత్సరాలుగా (నేర్చుకొని సేవ చేయటం) అనే ఆదర్శ వాక్యంతో విద్యా సేవను అందిస్తోందని చెప్పారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ, పీజీ, మేనేజ్‌మెంట్, ఇతర వృత్తిపరమైన విద్యా కార్యక్రమాలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తూ, నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను విద్యార్థుల్లో పెంపొందిస్తున్నామని తెలిపారు. విద్య, విలువలు, సమాజ సేవ అనే మూడు ప్రధాన సూత్రాలతో శివశివాని దేశంలోని ప్రముఖ విద్యాసంస్థగా గుర్తింపు పొందిందని ఆమె పేర్కొన్నారు. బ్లూ సఫైర్ జూబ్లీ వేడుకల్లో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రముఖులు, విశిష్ట అతిథులు, పాల్గొని సంస్థ వ్యవస్థాపకుల దూరదృష్టిని స్మరించుకున్నారు. (విద్యా సేవే మా ధ్యేయం) అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ వేడుకలు సంస్థ 65 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని ప్రతిబింబించాయి.




# భూక్యా మీట్య నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం సంగ్య తండా గ్రామానికి చెందిన ముల్కలపల్లి మాజీ సర్పంచ్ భూక్యా మీట్య నాయక్ మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు బీర్ల ఐలయ్య వారి నివాసానికి చేరుకుని మీట్య నాయక్ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీట్య నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి ఓదార్పునిచ్చారు. మీట్య నాయక్ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని, గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని బీర్ల ఐలయ్య కొనియాడారు. వారి సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. అలాగే, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు.



# ఆగస్ట్ 10 నా జరిగే జైల్ భరో ను జయప్రదం చేయండి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 04, నారాయణ ఖేడ్ :**
ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూనంగా కార్మిక, రైతు, ప్రజా, వ్యతిరేక విధానాలను మరింత వేగవంతం అమలు చేస్తున్నది ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాతో సాధించుకున్న దేశ స్వతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నది నాడు బ్రిటిష్ ప్రభుత్వం ప్రత్యేకంగా స్వతంత్రం కోసం సాయినాథ్ కేంద్రీయ ఉద్యమం స్ఫూర్తితో కార్పొరేట్ పత్తిపాడుదారులకు వ్యతిరేకంగా నేడు కార్మికులు రైతులు వ్యవసాయకులను ప్రజలు ప్రజాతంత్ర వాదులు క్విట్ ఇండియా స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకోవడం కోసం పోరాడాలని అన్నారు ఆరోగ్యశాఖలో వివిధ స్కీమ్ లో కోటి మంది కి పైగా పనిచేస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత కనీస వేతనానికి నోచుకునే పరిస్థితి లేదు లేబర్ కోడ్ అమలు అయితే తరతరాలుగా పోరాడి సాధించుకుని హక్కులు కార్మిక వర్గం కోల్పోతుందని కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశ అంగన్వాడి జిపి మున్సిపల్ కార్మికులకు జీతం 18,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే కార్మికులను పట్టించుకునే పరిస్థితి లేదు కావున కార్మికులు రైతులు కూలీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలపై ఆగస్టు 10న జరిగే జైలు బారో కార్యక్రమాన్ని స్వీట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో జయప్రదం చేయాలని అన్నారు. ఆశ వర్కర్లు స్వరూప వజ్రమని రుక్మిణి నరసమ్మ సాయమ్మ జనాభాయ్ సుందుజా తదితరులు ఉన్నారు.

# ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం పెద్ది సుదర్శన్ రెడ్డి

## మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన కోదాటి వెంకన్న



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి మహబూబాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సెక్రటరీ కోదాటి వెంకన్న మంగళవారం పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రలో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని పెంపొందించారని అన్నారు. ఉద్యమం క్లిష్ట దశలో ఉన్నప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపించిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఉద్యమ కాలంలో పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భాలు తనకు ఇప్పటికీ మధుర జ్ఞాపకాలుగా ఉన్నాయని కోదాటి వెంకన్న గుర్తు చేసుకున్నారు. ఉద్యమకారులను ఒకే తాటిపైకి తీసుకురావడంలో, ప్రజల్లో ధైర్యం నింపడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా ప్రజల మనిషిగా, ఉద్యమవేత్తగా, సేవాభావం కలిగిన వ్యక్తిగా పెద్ది సుదర్శన్ రెడ్డి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయంగా భావించి నిరంతరం ప్రజల్లోనే ఉంటూ సేవలందించారని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణకు తీరని లోటని, ఆయన ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని కోదాటి వెంకన్న అభిప్రాయపడ్డారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

# బాలికల మూత్రషాలాల ముందు పెరిగిన పిచ్చి మొక్కలు... భయభ్రాంతులకు గురవుతున్న విద్యార్థులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 04, నారాయణ ఖేడ్ :**
సంగారెడ్డి జిల్లా మనూరు మండలం రాయిపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని బాలికల టాయిలెట్స్ ముందర ఎక్కువ పిచ్చి మొక్కలతో నిండిపోయింది బాలికలు టాయిలెట్ కి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఎక్కువ పెరిగిన పిచ్చి మొక్కలల్లో విషపురితమైన పాములు తిరిగే అవకాశం వుంది అయినా కనీసం పట్టించుకోవడం లేదు ఇలాగే ఉంటే విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది కావున ఇప్పటికైనా స్కూల్ యాజమాన్యం స్పందించి వెంటనే ఆ పిచ్చి మొక్కలను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్కూల్ పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# తప్పుడు ప్రెస్ కమిటీని నమ్మొద్దు.!

- **మండలంలో రిజిస్ట్రేషన్ ప్రెస్ క్లబ్ ఒక్కటే ఉంది.**
- **కమిటీల పేరుతో ప్రెస్ క్లబ్ ను విచ్ఛిన్నం చేస్తే సహించం.**
- **ఉద్యోగులను పీడిస్తూ వసూళ్లకు పాల్పడుతున్న వైనం.**

**పెద్దవంగర, హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04 :**
కమిటీల పేరుతో ప్రెస్ క్లబ్ ను విచ్చినం చేస్తే సహించేది లేదని రిజిస్ట్రేషన్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డా. కుమ్మరి రామ్మూర్తి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలో రిజిస్ట్రేషన్ అయిన ప్రెస్ క్లబ్ ఒక్కటి మాత్రమే ఉందని, దానిని చీల్చడానికి ప్రయత్నిస్తే సహించబోమని అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ ప్రముఖ పత్రికలో పనిచేస్తూ వసూళ్ల పరంపరకు తెరలేపుతున్నాడని, మండలంలో తెర వెనుక (షాడో) సత్య పిడిఎఫ్ పేపర్ ను అడ్డుపెట్టుకొని వసూళ్లకు తెరలేపుతున్నాడు. కంప్యూటర్లో డీటీపీ చేసి సత్య న్యూస్ పేపర్ అని ట్యాగ్ తగిలించి పిడిఎఫ్ చేసి మండల గ్రూపులలో కటింగ్ లు పెడుతున్నారు. ఒక్కో వార్తకు ఒక్కో రేటు. ఉద్యోగులు పదవి విరమణ పొందితే రూ. 10,000 వేల ప్యాకేజీ తీసుకొని వార్త రాస్తున్నాడు. మండలంలో జరుగుతున్న స్పాట్ వార్తలకు ఒక్కో దానికి 500 నుంచి 2,000 వసూలు చేసి సత్య న్యూస్ లో వార్త పంపిస్తున్నాడు. ఎన్నికల ముందు సర్వే పేరుతో లక్షలు దండుకుంటున్నాడు. సర్పంచికి సర్వే చేస్తే ఒక లక్ష, ఎంపీటీసీ, ఎంపీపీ సర్వే చేస్తే లక్ష యాభై వేలు , ఎమ్మెల్యే ఎలక్షన్లో సర్వే చేస్తే 10 లక్షలు వసూలు చేస్తున్నాడని మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. చివరికి కిరాణం షాపులో కూడా షాంపూలు ఎత్తుకెళ్తున్న వైనం మండలంలో కనిపిస్తున్నదని, ఆశా వర్కర్లు, అంగనవాడి టీచర్లు, హెల్త్ సబ్ సెంటర్ ల ఉద్యోగులను పీడిస్తూ వసూలు చేస్తున్నాడన్నారు. మండలంలో రిజిస్ట్రేషన్ అయిన ప్రెస్ క్లబ్ ఉండగా ..తన సొంత ప్రయోజనాల కోసం చిన్నాచితక అమాయకమైన నలుగురిని వెంటేసుకొని దానికి ప్రెస్ క్లబ్ అని పేరు పెట్టి వారికి తెలియకుండా వసూళ్లకు పాల్పడుతున్నాడు. మండలంలో ప్రముఖ విలేఖరి గురించి చర్చనీయాంశంగా మారిందన్నారు. నైతిక విలువలు లేని క్లబ్ ను ఏర్పాటు చేస్తూ



అధికారులను, ఉద్యోగులను, ప్రజా ప్రతినిధులను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించబోమని తెలిపారు. మండలంలోని అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు గమనించగలరని రిజిస్ట్రేషన్ ప్రెస్ క్లబ్ సభ్యులు కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుల్లపల్లి సదానందం, ప్రధాన కార్యదర్శి పానుగోతు బాలాజీ,ఉపాధ్యక్షుడు రాయారపు రాజు, కోశాధికారి సుధగాని యాకయ్య, సభ్యులు తులసి వేణు, గంగారపు మధు, చింతల ఐలయ్య, కూతాటి రమేష్, మల్లేష్, చైతన్య శర్మ తదితరులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ సమావేశం

**పీహెచ్‌సీ మీర్జాపూర్ పరిధిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, తెలంగాణ బ్యూరో**
: సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు లక్ష్యంగా పీహెచ్‌సీ హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ పరిధిలో మంగళవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. హుస్నాబాద్ మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లను సందర్శించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మీర్జాపూర్ గ్రామంలోని చింతలవాడలో ఇండ్లపై నుంచి వెళ్తున్న హై వోల్టేజ్ విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాల వల్ల ప్రజలు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ మండల స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇండ్లపై నుంచి వెళ్తున్న హై వోల్టేజ్ విద్యుత్ వైర్లను తొలగించి, సురక్షిత దూరంలోకి మార్చేందుకు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మీర్జాపూర్‌లో నిర్వహిస్తున్న ఆషా డే కార్యక్రమంలో పాల్గొని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. జ్వరాలు, డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ల వంటి సీజనల్ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో తగిన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని



సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త ప్రతిరోజు కనీసం 30 గృహాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని, డ్రై డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. నిర్వహించిన సర్వేలు, గుర్తించిన జ్వర కేసులు, చేపట్టిన నివారణ చర్యలకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేసి నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది, గ్రామ సర్పంచులు, వేల్పుల సంపత్ కుమార్ (మీర్జాపూర్), భూక్య రాజేశ్వరి, తిరుపతి నాయక్ (వంగరామాయపల్లి), ఉప సర్పంచులు స్వరనుకుమార్, రాజు, గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి దెబ్బతో దిగివచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 04, నారాయణ ఖేడ్ :**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, నల్లవాగు ప్రాజెక్టులో తగినంత నీటి మట్టం ఉన్నా కాలువల ద్వారా నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరించారని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆరోపించారు. నిన్న నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ అంశంపై ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను నిలదీయగా, ఈ రోజు ఎమ్మెల్యే మరియు అధికారులు హుటాహుటిన ప్రాజెక్టును సందర్శించి నీటిని విడుదల చేయడం తమ ప్రశ్నలకు సమాధానమని అన్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇంత ఆలస్యం జరిగేదే కాదని విమర్శించారు. “మేము ప్రశ్నిస్తేనే ప్రభుత్వం కదులుతోంది” అని భూపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని ప్రకటించగానే గతంలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, ఇప్పుడు నల్లవాగు ప్రాజెక్టు విషయంలో కూడా మీడియా సమావేశం నిర్వహించి ప్రశ్నించగానే నీటిని విడుదల చేశారని తెలిపారు. ప్రజలపై ప్రేమతో కాకుండా, ప్రజా ఒత్తిడి మరియు బీఆర్ఎస్ పోరాటాలకు భయపడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేకు రైతుల సమస్యలపై అవగాహన లేదని, ప్రజల కష్టాలపై బాధ్యత కూడా కనిపించడం లేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజుగా చూసే విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, నారాయణఖేడ్ నియోజకవర్గంలో సాగునీరు, రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని గుర్తు చేశారు. రైతులను పువ్వుల్లో పెట్టుకుని చూసుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కేవలం నీటిని విడుదల చేయడం సరిపోదని, నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువలను వెంటనే పూడికతీసి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు పొలానికి సాగునీరు చేరేలా ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. అలాగే ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నలకు సంబంధించిన బకాయిలను రైతులకు సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. బిల్లులు మంజూరు కావాలంటే కమిషన్లు ఇవ్వాల్సి వస్తోందని రైతులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి తాలూకా స్థాయి వరకు కమిషన్ వ్యవస్థ నడుస్తోందని, అందులో స్థానిక ఎమ్మెల్యేకు కూడా వాటా ఉందని రైతులు



చెబుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కమిషన్ రాజకీయాలకు స్వస్తి చెప్పి, రైతులకు రావాల్సిన జొన్నల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని పనిచేయాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని ప్రజా పోరాటాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, మాజీ ఎంపీటీసీ ముజామిల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, మాజీ కౌన్సిలర్ విఠల్, మాజీ సర్పంచులు రాజు నాయక్, రవీందర్ నాయక్, నాయకులు మిట్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 11నే స్వాతంత్ర్య దినోత్సవం! ఇంటింటికీ జెండా ఎగురవేయండి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04 :**
పాకిస్థాన్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ దేశం నుంచి ఇప్పటికే వేరుపడుతున్నట్లు ప్రకటించిన ‘రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్’ సమూహం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 11వ తేదీని తమ అధికారిక స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటిస్తూ.. ప్రపంచ దేశాలన్నీ తమను ప్రత్యేక దేశంగా గురింపు ఇవ్వాలని మరోసారి గట్టిగా డిమాండ్ చేసింది. బలూచిస్తాన్ విముక్తి పోరాట నాయకుడు మీర్ యార్ బలూచ్ ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బలూచ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటింటిపైనా, వీధులు, వ్యాపార సముదాయాలు, విద్యా సంస్థల్లో బలూచిస్తాన్ జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. రాబోయే తరాలకు తమ పోరాట చరిత్రను, ఈ రోజు ప్రాముఖ్యతను గుర్తుచేసేందుకే ఆగస్టు 11న ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇకపై ప్రతి ఏటా ఈ తేదీనే తమ స్వాతంత్ర్య దినంగా జరుపుకుంటామని స్పష్టం చేశారు.

**ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి!**
పాకిస్థాన్ ప్రస్తుత రూపంలో ఉన్నంత కాలం దక్షిణాసియాలో శాంతి, అభివృద్ధి సాధ్యం కాదని బలూచ్ నాయకత్వం తేల్చిచెప్పింది. దాదాపు 6 కోట్ల మంది బలూచ్ ప్రజలు తమను తాము స్వతంత్ర దేశంగా భావిస్తున్నారని, అంతర్జాతీయ సమాజం కూడా తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించి మద్దతుగా నిలవాలని కోరింది. సరిగ్గా పాకిస్థాన్ ఆగస్టు 14న, భారత్ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకునే ముందు బలూచిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

**ఆగస్టు 11 వెనుక ఉన్న చారిత్రక కథేంటి?**
బలూచిస్తాన్ ఆగస్టు 11నే ఎందుకు ఎంచుకుందనే దానికి పెద్ద చరిత్రే ఉంది. 1947లో బ్రిటిష్ పాలకులు భారత్ వదిలి వెళుతున్న సమయంలో, ఆగస్టు 11నే బలూచిస్తాన్ మొదటిసారిగా తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. ఆ రోజుల్లో ‘న్యూయార్క్ టైమ్స్’ వంటి అంతర్జాతీయ పత్రికలు, అల్ ఇండియా రేడియో కూడా ఈ వార్తను ప్రముఖంగా ప్రసారం చేశాయి. అందుకే నాటి చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ ఈ తేదీనే తమ నేషనల్ డేగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

**"పాకిస్థాన్ చరిత్రంతా హింస, విధ్వంసమే"**
పాకిస్థాన్ విధానాల వల్ల కేవలం తమ ప్రాంతమే కాకుండా, ఇటు దక్షిణాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా అశాంతి నెలకొందని బలూచ్ నేతలు ఆరోపించారు. 1948 మార్చిలో బలూచిస్తాన్‌ను ఆక్రమించుకోవడం మొదలుకొని, 1971 బంగ్లాదేశ్ విముక్తి పోరాటం, చాగైలో అణు పరీక్షలు, ఉగ్రవాదానికి ఊతమివ్వడం వరకు పాక్ సైన్యం అనేక ప్రాంతాల్లో రక్తం ఏర్లు పారించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ చట్రం నుంచి బయటకు వస్తేనే ప్రాంతీయ సుస్థిరత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.



# బస్ భవన్ ముట్టడి ఉద్రిక్తత..పోలీసులతో వాగ్వాదం

**2013, 2017, 2021 వేతన సవరణ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్**

**ప్రభుత్వానికి తీన్మార్ మల్లన్న డెడ్ లైన్**

**వారం రోజుల్లో బెనిఫిట్స్ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**

**అవసరమైతే కార్మికులతో కలిసి అసెంబ్లీ ముట్టడి**

**ఆర్టీసీ ఎన్నికల్లోనూ పోరాటానికి సిద్ధమని మల్లన్న స్పష్టం**

**రేవంత్ రెడ్డి చేతకాని దద్దమ్మ ముఖ్యమంత్రి**

**మహేష్ కుమార్ గౌడ్, పొన్నం సమాధానం చెప్పాలి**

**కార్మికులకు అండగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ**

**రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల కోసం బస్ భవన్‌లో గళమెత్తిన టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**







**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లోని బస్ భవన్‌ను ముట్టడించిన టి.జి.ఎస్.ఆర్.టి.సి విశ్రాంతి ఉద్యోగుల ఆందోళన మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. రిటైర్డ్ ఉద్యోగులకు మద్దతుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బస్ భవన్‌కు చేరుకోగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చివరకు మల్లన్నతో పాటు ఐదుగురు రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులకు మాత్రమే అధికారులను కలిసేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు.అనంతరం ఆర్టీసీ అధికారులతో జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై వారిని మల్లన్న నిలదీశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన పిఎఫ్, ఈపిఎస్-95, పిఎఫ్ కాంట్రిబ్యూషన్, డీఏ, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని మండిపడ్డారు.2013లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఎంప్లాయర్ వాటా పిఎఫ్ ఇప్పటికీ చెల్లించలేదని, 2017 నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు 2021 నుంచి రావాల్సిన బకాయిలు విడుదల కాలేదని పేర్కొన్నారు. ఉద్యోగులు జీవితాంతం సంస్థ కోసం కష్టపడితే, రిటైర్మెంట్ తర్వాత వారికి రావాల్సిన కష్టార్జిత సొమ్మును నిలిపివేయడం అమానుషమని అన్నారు.అనంతరం మీడియాతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... రేవంత్ ప్రభుత్వంపై మల్లన్న తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, సమ్మె సమయంలో కార్మికులకు అండగా ఉన్నట్లు చెప్పుకున్న ప్రభుత్వం, తర్వాత వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఢిల్లీ మాదిరి ఉద్యమం ఈ తెలంగాణలో పుట్టిస్తానని మల్లన్న స్పష్టం చేశారు.రేవంత్ రెడ్డి లాంటి ఒక సన్నాసి దద్దమ్మ ముఖ్యమంత్రి ఉన్నందు వలన ఆర్టీసీ కార్మికులకు ఈ పరిస్థితి ఏర్పడిందని ఇలాంటి ముఖ్యమంత్రి మన తెలంగాణకు ఉండడం దురదృష్టకరమని అన్నారు. రాబోయే రోజుల్లో ఇదే ఆర్టీసీ కార్మికులు రేవంత్ సర్కార్ ను బొందపెడుతుందని హెచ్చరించారు."17 వేల మంది రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు అండగా తీన్మార్ మల్లన్న ఉన్నాడని, వారి హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. అవసరమైతే బస్ భవన్ ను అమ్రాస్ పాట పెట్టి అమ్మైనా సరే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించుకుంటామని ఆ పరిస్థితి రాకుండా ప్రభుత్వం చూసుకోవాలని స్పష్టం చేశారు.వారం రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బెనిఫిట్స్ విడుదల చేయాలని, లేకుంటే డిల్లీ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కేవలం వారం రోజులే రేవంత్ సర్కార్ కు డెడ్ లైన్ అని హెచ్చరించారు. అవసరమైతే రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రకటించారు.ఆర్టీసీ ఎన్నికల విషయాన్ని ప్రస్తావిస్తూ "దమ్ముంటే ఎన్నికలకు రండి... నేను ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల తరఫున వస్తా...రేవంత్ తన బొమ్మతో, కాంగ్రెస్ పార్టీ జెండాతో రావాలని... కార్మికులే తీర్పు చెబుతారు" అంటూ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు."కార్మికులను మోసం చేస్తే ప్రభుత్వం, అధికారులు ఇద్దరూ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని, ఆర్టీసీ ఉద్యోగులను నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదు" అని మల్లన్న హెచ్చరించారు.రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేయడంతో పాటు అసెంబ్లీ ముట్టడి సహా భారీ ఉద్యమాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకత్వం వహిస్తుందని ప్రకటించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన నిలుస్తుందని, వారి హక్కుల సాధన కోసం శాసనమండలిలో, ప్రజాక్షేత్రంలోనూ తీన్మార్ మల్లన్నగా పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన్ వర్కర్స్ యూనియన్ చైర్మన్ సంపత్ ముదిరాజ్ ,రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ సాజిద్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ బిడబ్ల్యుయూ గౌరవ అధ్యక్షుడు టివిఆర్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, సహాయ కార్యదర్శి గిరిగాని బిక్షపతి గౌడ్, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## "ప్రమాదకరంగా మ్యాన్ హోల్.. ప్రయాణికుల హడల్" కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు

**ఆగష్టు 04, ఓల్డ్ బోయినపల్లి,**

**హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**


హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
epaper.hyderabadpulsenews.in | Date: 28 Jul, 2026 | Page: 6

ప్రమాదకరంగా మ్యాన్ హోల్ - వాహనదారుల హడల్

అధికారుల దృష్టికి హైదరాబాద్ పల్స్ పత్రిక ప్రయత్నం

డ్రైనేజీ మూతలు.. రోడ్డు ప్రమాదాలకు బాటలు

బోయిన్పల్లి, జూలై 27,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : మేడ్చల్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికింద్రాబాద్ సర్కిల్ -3, ఓల్డ్ బోయినపల్లి 262 డివిజన్ పరిధిలోని అలీ కాంప్లెక్స్, శ్రీ సాయి ఎంక్లేవ్, చెక్ పోస్ట్ వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ మూత ప్రమాదకరంగా మారిందని జూలై నెల 7 వ తేదీన డ్రైనేజీ మూతలు, రోడ్లు ప్రమాదలకు బాటలు అని హైదరాబాద్ పల్స్ పత్రికలో ప్రచురించిన అధికారుల నుండి కానీ, సిబ్బంది నుండి కానీ ఎలాంటి బాధ్యత ఎదురు అవ్వలేదు. కాగా డ్రైనేజీ మూత అత్యంత ప్రమాదకరంగా మారింది, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు రహదారిలో వెళ్లిన పట్టించుకోని వైనం, ఇప్పటికైనా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలంటూ పలువురు వాహనదారులు, నడకదారులు హైదరాబాద్ పల్స్ పత్రిక ద్వారా కోరుతున్నారు.

మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికింద్రాబాద్ సర్కిల్ 3 లో గల ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ అలీ కాంప్లెక్స్ వద్ద ఏర్పడినటువంటి డ్రైనేజీ మూత సమస్య పై హైదరాబాద్ పల్స్ పత్రికలో డ్రైనేజీ మూతలు ప్రమాదానికి బాటలు, ప్రమాదకరంగా మ్యాన్ హోల్ వాహనదారుల హడల్ అనే వార్తల కథనానికి స్పందించిన మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సమస్య ఉన్నటువంటి ప్రాంతాన్ని గుర్తించి తెరిచి మరియు ప్రమాదకరంగా ఉన్న మూతను తొలగించి దాని స్థానంలో కొత్త మూతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి అక్కడ ఉన్న ప్రజలు, వ్యాపారులు, ప్రయాణికులు వాహనదారులు ముఖ్యంగా హైదరాబాద్ పల్స్ పత్రిక తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎక్కడైతే సమస్య ఉందో ఆ సమీపంలో ఉన్నటువంటి మిగతా డ్రైనేజీ మూతలను కూడా గుర్తించి వాటి యొక్క స్థితిగతులను సక్రమంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నారు. ఈ సమస్యపై స్పందించి అధికారుల దృష్టికీ తీసుకెళ్లిన హైదరాబాద్ పల్స్ పత్రిక ప్రతినిధిని పలువురు అభినందించారు.

## విరుచుకుపడుతున్న అరుదైన వైరస్ – 22 మంది చిన్నారుల మృతి, హై అలర్ట్..!!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, సెంట్రల్ డెస్క్ :**

మరో కొత్త వైరస్ వెలుగులోకి వచ్చింది. చిన్నారుల ప్రాణాలు తీస్తోంది. ఈ అరుదైన వైరస్ కారణం గా ఇప్పటికే 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజారాత్ లో 'చాందీపుర వైరస్' కలకలం రేపుతోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 184 మందికి పైగా అనుమానిత కేసులు నమోదు కాగా, వారిలో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ప్రభుత్వం ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తం చేసింది.గుజరాత్ లో ప్రాణాంతక వైరస్ చిన్నారులను బలి తీసుకుంటోంది. ఈ వైరస్ బారిన పడి ఇప్పటివరకు 22 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. మరో 11 నమూనాల పరీక్ష ఫలితాలు రావాల్సి ఉందని తెలిపారు. పాజిటివ్ నిర్ధారణ అయిన ఏడుగురు పిల్లలు రాష్ట్రంలోని వివిధ సివిల్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఆరుగురు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. గాంధీనగర్, సబర్కాంత-హిమ్మత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ఆసుపత్రులలో చేరిన చిన్నారులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స కొనసాగుతోంది. అయితే, ఈ వైరస్ బారిన పడిన వారంతా15 సంవత్సరాలపు లోపువారుగా గుర్తించారు.అయితే, ఈ కేసులు నిర్దిష్టంగా ఒకే ప్రాంతానికి పరిమితం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వెలుగులోకి వస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ఆరోగ్య శాఖ బృందాలు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాయి. ఇసుక ఈగలు ఈ వైరస్‌కు ప్రధాన వాహకాలు కావడంతో, పశువులు పెంచే ప్రాంతాల్లో పెద్ద ఎత్తున క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. మట్టి ఇళ్ల గోడల పగుళ్లను మూసివేయాలని ప్రజలకు సూచించారు.ఈ వైరస్ లక్షణాల పైన అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా అధిక జ్వరం, వాంతులు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని, ఆక్సిజన్ తో పాటుగా వెంటిలేటర్ సదుపాయం ఉన్న ఐసీయూలో చేర్పించాలని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను ఆదేశించారు. ప్రభుత్వం ఈ వైరస్ పైన అవగాహన పెంచే చర్యలు చేపట్టింది. దీంతో.. ఇప్పుడు ఈ వైరస్ ఆందోళన పెంచుతోంది.

# క్షుద్ర రాజకీయాలా? రాజకీయ వ్యూహాలా?

## : హరీశ్ రావు వర్సెస్ కాంగ్రెస్ 'తాంత్రిక' సమరం!

**చేతబడి రాజకీయం: కాంగ్రెస్ 'తాంత్రిక' దాడి.. హరీశ్ రావు లీగల్ కౌంటర్!**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, మెయిన్ డెస్క్:**

తెలంగాణ రాజకీయం ఒకప్పుడు విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి నమూనాల చుట్టూ తిరిగేది. కానీ, ప్రధాన పార్టీల మధ్య వైరం ఏ స్థాయికి చేరిందో చెప్పడానికి ఇటీవల రాష్ట్రంలో రేగిన 'క్షుద్ర పూజల' వివాదమే స్పష్టమైన ఉదాహరణ. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును గురిపెట్టి కాంగ్రెస్ నేతలు చేసిన 'తాంత్రిక పూజల' ఆరోపణలు, దానికి ప్రతిగా హరీశ్ రావు విసిరిన చట్టపరమైన సవాళ్లు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి.

**పూజల వెనుక కుట్ర :**

ఈ రచ్చకు బీజం పడింది కాంగ్రెస్ నాయకుల సంచలన ప్రకటనలతోనే. ఇటీవల హరీశ్ రావు తమిళనాడులోని తిరుచిరాపల్లి, కర్ణాటకలోని శివమొగ్గ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ఈ పర్యటనలను కాంగ్రెస్ నాయకత్వం తమకు అనుకూలమైన రాజకీయ అస్త్రంగా మలచుకుంది. రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, కరువు కాటకాలు అలముకోవాలని, ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచవచ్చనే ఉద్దేశంతోనే హరీశ్ రావు ఆ ఆలయాల్లో రహస్యంగా తాంత్రిక క్రతువులు చేయించారంటూ కాంగ్రెస్ పక్షం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఆయన పర్యటనల వెనుక ఉన్న అసలు మర్మమేంటో ప్రజలకు సమాధానం చెప్పాలంటూ ఒత్తిడి పెంచింది.

**కేసులు వర్సెస్ లీగల్ నోటీసులు:**

కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, ఈ వివాదం కాస్తా చట్టపరమైన పోరుగా రూపాంతరం చెందింది. టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో హరీశ్ రావుపై ఫిర్యాదు చేశారు. రాష్ట్రానికి చేటు తెచ్చేలా క్షుద్ర పూజలు చేయిస్తూ ప్రభుత్వంపై కుట్ర పన్నుతున్నారంటూ,




బిఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) చట్టాల ప్రకారం ఆయనపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. మరోవైపు, ఈ తరహా ఆరోపణలను హరీశ్ రావు తేలికగా తీసుకోలేదు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా అసత్యాలు ప్రచారం చేశారంటూ కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, సామా రామ్మోహన్ రెడ్డిలకు ఆయన లీగల్ నోటీసులు పంపారు. 24 గంటల్లోగా మీడియా వేదికగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, సోషల్ మీడియా నుంచి ఆ వీడియోలను తొలగించాలని, లేనిపక్షంలో క్రిమినల్, సివిల్ పరువు నష్టం కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ పార్టీ స్పందించింది. ఆ పార్టీ నేత బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ వైఖరిపై మండిపడ్డారు. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వంటి అగ్రనేతలు కూడా గుళ్లకు వెళ్తుంటారని, మరి వారి పర్యటనలను కూడా క్షుద్ర పూజలుగానే పరిగణిస్తారా అని నిలదీశారు.

సెంటిమెంట్ దాడి వెనుక రాజకీయ వ్యూహం:

హరీశ్ రావుపై ఈ స్థాయిలో తాంత్రిక ముద్ర వేయడం వెనుక కాంగ్రెస్‌కు పక్కా రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రైతు రుణమాఫీ, హామీల అమలు, విద్యుత్ కోతల వంటి పాలనాపరమైన విషయాల్లో హరీశ్ రావు నిత్యం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దాంతో, ఈ ప్రజా సమస్యల ఆధారిత చర్చ నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ 'ఆధ్యాత్మిక-సెంటిమెంట్' వివాదాన్ని ముందుకు తెచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. హరీశ్ రావును ఒక సమర్థుడైన పాలకుడిగా కాకుండా, 'మూఢనమ్మకాలు ఉన్న వ్యక్తిగా', 'రాష్ట్రానికి కీడు కోరే నాయకుడిగా' ప్రజల్లో చిత్రీకరించి ఆయన రాజకీయ విశ్వసనీయతను తగ్గించడమే ఈ వ్యూహంలో ప్రధాన భాగమని భావిస్తున్నారు.

**పదవుల కోసమే ఈ టార్గెట్?**

బీఆర్ఎస్ నేతలు మాత్రం ఈ ఆరోపణలను వేరే కోణంలో చూస్తున్నారు. తమ పార్టీలోని కీలక నేతలను, ముఖ్యంగా హరీశ్ రావును టార్గెట్ చేసే వారికి కాంగ్రెస్ అధిష్ఠానం తగిన ఆఫర్లు ఇస్తోందని వారు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట నరసింహారావులకు మంత్రి హోదా కల్పించడమే ఇందుకు నిదర్శనమని పాయింట్ అవుట్ చేస్తున్నారు. అధిష్ఠానం దృష్టిలో పడి పదవులు దక్కించుకోవడానికి, పార్టీలో తమ స్థానాన్ని పదిలం చేసుకోవడానికే కాంగ్రెస్ నేతలు హరీశ్ రావును ప్రధాన లక్ష్యంగా ఎంచుకున్నారని గులాబీ శ్రేణులు ప్రత్యారోపణలు చేస్తున్నాయి.

**దిగజారుతున్న రాజకీయ ప్రమాణాలు:**

ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థుల మధ్య సిద్ధాంతపరమైన విమర్శలు, పాలనాపరమైన దాడులు సర్వసాధారణం. కానీ, "వర్షాలు పడకుండా పూజలు చేశారు" అనే స్థాయికి చర్చను తీసుకురావడంపై సామాన్య ప్రజలతో పాటు మేధావుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ విసిరిన ఈ సెంటిమెంట్ విమర్శలను హరీశ్ రావు చట్టపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. అయితే, రాబోయే రోజుల్లో ప్రజలు కోరుకునే అభివృద్ధి, ప్రజా సంక్షేమ అంశాలు చర్చకు వస్తాయా లేక ఈ తాంత్రిక ఆరోపణల పరంపరే కొనసాగుతుందా అనేది వేచి చూడాలి.

హైదరాబాద్ పల్స్

## వైద్య చికిత్స కోసం ఎల్.ఓ.సి ఎమ్మెల్యే అందచేత

**తన నివాసంలో భాధితులకు సిఎంఆర్ఎఫ్ కింద చెక్కుల పంపిణి**





**ఆగష్టు 04, తుకారాం గేట్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** సుమారు 3 లక్షల 70 వేల రూపాయల విలువైన ఎల్.ఓ.సిలను అందజేసిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్. తిరుమలగిరి మండలంలోని పెద్ద తోకట్ట ప్రాంతానికి చెందిన క్రైతోజ్ భీం రాజ్ కుమారుడు అనీల్ కుమార్, వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం, పుట్టపహాడ్ గ్రామానికి చెందిన మహమ్మద్ జసీర్ కుమార్తె మహమ్మద్ హిఫ్రా వైద్య చికిత్స  కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేరడం జరిగింది. బాధితుల కుటుంబ బలహీన ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఎమ్మెల్యే సిఎంఆర్ఎఫ్ కింద అనీల్ కుమార్ కు 2 లక్షల 50 వేలు, మహమ్మద్ హిఫ్రా కు 1 లక్షా 20 వేల రూపాయల విలువైన ఎల్.ఓ.సి లను మంజూరు చేయించారు.మంగళవారం నాడు ఎల్.ఓ.సిలను ఎమ్మెల్యే శ్రీగణేష్ తన నివాసంలోని కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తమ బిడ్డల వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం చేసిన ముఖ్యమంత్రి కి, మరియు ప్రత్యేక కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## పేరుమండ్ల సంకీసలో అంబేద్కర్ యూత్‌కు కొత్త అధ్యక్షుడిగా కనకం ఉపేందర్ ఏకగ్రీవ ఎన్నిక





**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 04, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పేరుమండ్ల సంకీస గ్రామంలో మంగళవారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడి ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. గ్రామ యువత, సంఘ సభ్యుల సమక్షంలో కనకం ఉపేందర్‌ను అంబేద్కర్ యూత్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కనకం ఉపేందర్ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గ్రామ యువతలో విస్తృతంగా చాటిచెప్పేందుకు కృషి చేస్తానని, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ యువతను ఐక్యంగా నడిపిస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడికి పలువురు గ్రామ పెద్దలు, యువకులు, సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. అభినందనలు తెలుపుతూ, అంబేద్కర్ ఆశయాల సాధనలో సమర్థవంతంగా పనిచేసి సంఘానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమావేశం అనంతరం సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ నూతన అధ్యక్షుడికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## బసంతపురంలో పశు వైద్య శిబిరం...



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం బసంతపురం గ్రామంలో మంగళవారం మెగా పశు వైద్య శిబిరం సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో రఘునాథపురం డాక్టర్ భాస్కర్ మరియు బసంతపురం గోపాలమిత్ర మహేష్, బసంతపురం గ్రామ పాడి రైతులు పాల్గొని విజయవంతం చేశారు. సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషకరమని గ్రామ రైతులు సర్పంచ్ ని అభినందించారు.

# పి.ఓ.కె నిరసనల్ని కవర్ చేసినందుకు..! 'అల్ జజీరా' మీడియాపై పాకిస్థాన్ (బ్యాన్) ఆంక్షలు..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04:** అంతర్జాతీయ మీడియా సంస్థ 'అల్ జజీరా' పై పాకిస్థాన్ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఆందోళనలు చేపడుతున్న నిరసనకారులపై పాకిస్థాన్ ప్రభుత్వం దమనకాండ కొనసాగిస్తోందని అక్కడి ప్రజలపై పాకిస్థాన్ ప్రభుత్వం దాడులు చేపడుతోందని అల్ జజీరా న్యూస్ ప్రసారం చేస్తున్నట్లు గుర్తించిన తరుణంలో ఈ మీడియా సంస్థపై పాక్ ప్రభుత్వం ఆంక్షలు విధించినట్లు స్పష్టం అవుతోంది. అయితే షెహబాజ్ ప్రభుత్వం ఈ న్యూస్ మాధ్యమంపై పూర్తిగా నిషేధం విధించనప్పటికీ పాకిస్థాన్ లోని అనేక ప్రాంతాల్లోని యూజర్స్ కు అల్ జజీరా మీడియా లైవ్ స్ట్రీమింగ్ కావడం లేదని సోషల్ మీడియాలో ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం.మరోవైపు పాకిస్థాన్ కు చెందిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. అల్ జజీరా సంస్థ సెలక్టివ్ రిపోర్టింగ్ చేస్తోందని మండిపడింది. పీఓకే జరుగుతున్న ఎన్నికలు, ఓటింగ్ విధానాన్ని తప్పుగా ప్రసారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన విషయాలను తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. " ముజఫరాబాద్ లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంచుకుని అల్ జజీరా మీడియా సంస్థ తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నట్లు గుర్తించాం. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఎన్నికలు, ఓటింగ్ విధానాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ న్యూస్ సంస్థ యత్నించినట్లు స్పష్టం అవుతోంది" అని ఎక్స్ మాధ్యమంలో పాకిస్థాన్ కు చెందిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పోస్టు చేసింది.ఖతార్‌కు చెందిన మీడియా సంస్థ "అల్ జజీరా" ఈ మేరకు పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో యెల్లో జర్నలిజం చేస్తోందని పాకిస్థాన్ ప్రభుత్వం కీలక ఆరోపణలు చేస్తోంది. ముజఫరాబాద్, పీఓకేలో ఎన్నికలను అపఖ్యాతి పాలు చేస్తోందని మండిపడింది. మరోవైపు పీఓకే లో మీడియా స్వేచ్ఛ క్షీణిస్తోందని కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.ఇక పీఓకే లో పరిస్థితిపై "అల్ జజీరా" కీలక విషయాలను ప్రచురించింది. ముజఫరాబాద్ లో ఓటింగ్ కు ప్రజలు ముందుకు రావడం లేదని పేర్కొంది. గత 50 రోజులుగా కొనసాగుతున్న ఇంటర్నెట్ సేవల నిలిపివేత కారణంగా స్థానిక పరిస్థితులను సమగ్రంగా నివేదించడం కష్టంగా మారిందని అల్ జజీరా స్పష్టం చేసింది. అలాగే ఆగస్టు 10 వరకు దశలవారీగా పీఓకే శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

## భువనగిరి ముస్తఫా చికెన్ మార్కెట్ లో నెలవారి లక్కీ డ్రా కార్యక్రమం

**మొదటి బహుమతి వాషింగ్ మెషిన్ ను గెలుచుకున్న నిది పాపా**

**ముఖ్య అతిథిగా హాజరై లక్కీడ్రా తీసిన మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్**

**ప్రతి కిలో చికెన్ పై ఒక కూపన్ ఇస్తున్నాం..చికెన్ షాప్స్ అసోసియేషన్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణంలోని స్థానిక ముస్తఫా చికెన్ మార్కెట్ ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహించే లక్కీ డ్రా కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై లక్కీ డ్రా తీశారు.ఈ సందర్భంగా మొదటి బహుమతి వాషింగ్ మెషిన్ ను నిది పాపా గెలుచుకున్నారు. రెండవ బహుమతి ట్రాలీ బ్యాగ్ ను 5 మంది, మూడవ బహుమతి బ్యాగ్ ను 10 మంది సొంతం చేసుకున్నారు. విజేతలకు చైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవి కుమార్ బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చికెన్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మీరా మాట్లాడుతూ..."ముస్తఫా చికెన్ మార్కెట్ లో ప్రతి కిలో చికెన్ కొనుగోలు పై ఒక కూపన్ ఇస్తున్నాం. ఈ లక్కీ డ్రా కార్యక్రమం ప్రతి నెలా నిరంతరం కొనసాగుతుంది. కస్టమర్లకు మరింత సంతోషం కలిగించేందుకే ఈ కార్యక్రమం" అని తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండీ జహంగీర్, అంగడి నాగరాజు, ఒమర్ చౌదరి, ఇర్షాద్, ఇందూరి ఇబ్రహీం, హాఫిజ్ ఫరీద్, వెంకటేష్, అమీన్, మైమన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు

## ఈశ్వరమ్మ యాదవ్ ని సత్కరించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా ఇటీవల నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి యాదగిరిగుట్ట స్వామి వారి పవిత్ర ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. దేవాలయ బోర్డు సభ్యురాలిగా నూతన బాధ్యతలు స్వీకరించినందుకు ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. యాదాద్రి క్షేత్ర అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు ఈశ్వరమ్మ తన వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా సునిత ఆకాంక్షించారు.

## మేరా భారత్ ఆధ్వర్యంలో యూత్ డెవలప్మెంట్ అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని అమ్మనబోలు గ్రామంలో ఆది జాంబవ యువజన సంఘం, బాలసుధ స్వచ్ఛంద సంస్థ వారిని కలిసి మేరా భారత్ కేంద్రం నల్గొండ ఆధ్వర్యంలో యూత్ డెవలప్మెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతకు ప్రభుత్వం తరఫున వచ్చే కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. యువతను సన్మార్గంలో నడుపుతూ, సమాజ అభివృద్ధికి యువత ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు తాళ్లపల్లి మహేష్, బాలసుధ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, యువ కవి భైరపాక స్వామి, ఆది జాంబవ యువజన సంఘం అధ్యక్షుడు కే.మల్లేష్, యూత్ సభ్యులు మహేందర్, రమేష్, శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## రాజపేట మండల అర్చక సంఘం నూతన అధ్యక్షునిగా వైరాగ్యం చంద్రశేఖర్ ఏకగ్రీవం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల దీప దూప నైవేద్య అర్చక సంఘం మంగళవారం రోజు రాజపేట మండల కేంద్రంలోని శ్రీ పుట్ట హనుమాన్ ఆలయంలో అర్చకులు శ్రీ చలివేదుల వెంకట రామ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు అందరూ హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షునిగా వైరాగ్యం చంద్రశేఖర్ (శివాలయం పూజారి రాజపేట) ఉపాధ్యక్షునిగా వేదాటి విక్రమ్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా తిరునగరి వెంకటేశం, సహాయ కార్యదర్శిగా చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ, కోశాధికారిగా తిరుక్కోవల్లూరు పాండురంగ స్వామి, ప్రధాన సలహాదారులుగా నల్ల విష్ణు, బొమ్మ కిషోర్, శంకుభద్రప్ప, లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు మంగవెల్లి చైతన్య, వేదాటి సత్యనారాయణ శర్మ, చెడదీపు కృష్ణ, పెంట సత్యనారాయణ, రేగొండ పాండురంగం, తిరుక్కోవల్లూరు వెంకట భాస్కర్, శంకు కోటేశ్వర్, రాగపురం వెంకటేశం, దేవరాజు నాగరాజు, నీలా శివకృష్ణ, ఏల విటల్, జిలుకర ఉపేంద్ర అంబరీష్ కుమార్, అందరి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## భువనగిరిలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి పంపిణీ

**విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్**

**విద్యార్థుల సంక్షేమే ప్రభుత్వ ధ్యేయం**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 04, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణంలోని 21వ వార్డ్ బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులకు భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ మరియు స్థానిక కౌన్సిలర్ వంగేటి సుచరిత కలిసి దుప్పట్లు, పుస్తకాలు, ప్లేట్లు, వాటర్ గ్లాసులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవి కుమార్ మాట్లాడుతూ..."విద్యార్థుల సంక్షేమే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. హాస్టల్ లో చదివే బీసీ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని అన్నారు. చదువుతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత కూడా ముఖ్యం అని అన్నారు. అందుకే దుప్పట్లు, పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి" అని అన్నారు. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది చైర్మన్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ తంగళ్లపల్లి రవికుమార్  వైస్ చైర్మన్ పోతాంశెట్టి మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్  కౌన్సిలర్ వంగేటి సుచరిత రెడ్డి, నాయకులు శనిగల సాయి రాజు, హమీద్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అది మన చేతుల్లో ఉండదు!

ప్రెగ్నెన్సీ కారణంగా ప్రస్తుతం సినిమాలకు పూర్తిగా బ్రేక్‌నిచ్చి విశ్రాంతి తీసుకుంటున్నది అగ్ర కథానాయిక సమంత. అయితే సోషల్‌మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో అప్‌డేట్స్‌ను పంచుకుంటున్నది. తాజాగా ఈ భామ ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. వీటికి తనదైన తాత్విక ధోరణిలో ఓ క్యాప్షన్‌ను జత చేసింది. 'సమయం ఎల్లప్పుడూ ఒకేలా ఉండదు. కొన్నిసార్లు మనల్ని పోరాటం వైపుకు నడిపిస్తుంది. కొన్నిసార్లు ఓపికతో ఎదురుచూసేలా చేస్తుంది.ఒక్కోసారి కొన్నింటిని వదిలేయాలని సంకేతాల్ని అందిస్తుంది. మనకు ఏ సమయం కావాలో ఎంచుకునే అవకాశం మన చేతుల్లో ఉండదు. అయితే ఏం జరిగినా మనదైన వ్యక్తిత్వంతో ఎలా జీవితంలో ముందుకుసాగుతున్నామన్నదే చాలా ముఖ్యం' అంటూ ఫొటోలకు పెట్టిన క్యాప్షన్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇటీవలే 'మా ఇంటి బంగారం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది సమంత. ఈ సినిమా వందకోట్ల వసూళ్లతో ఆమె కెరీర్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చింది



## SPORTS

# స్పిన్‌తో కుస్తీ



ముంబై: శ్రీలంక పర్యటనకు బయల్దేరేముందు భారత టెస్టు ఓపెనర్లు కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ స్పిన్‌తో కుస్తీలు పట్టారు. ఆది, సోమవారాల్లో ఈ ఇద్దరూ ముంబై బాంద్రాలోని ఓ స్పోర్ట్స్ సెంటర్‌లో స్పిన్‌ను మెరుగ్గా ఆడేందుకు తీవ్రంగా శ్రమించారు. లంకతో సిరీస్‌కు జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ముంబై స్పిన్నర్ తనుష్ కొటియాన్‌తో పాటు మరికొంతమంది లోకల్ స్పిన్నర్లతో ఓపెనింగ్ ద్వయం నెట్స్‌లో చెమటోడ్చింది. గతంలో స్పిన్‌ను అలవోకగా ఎదుర్కొనే భారత బ్యాటర్లు.. గడిచిన రెండేండ్లుగా స్వదేశంలో ప్రత్యర్థుల స్పిన్ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతూ తీవ్ర విమర్శల పాలవుతున్న విషయం తెలిసిందే. రాబోయే లంక సిరీస్ సైతం టీమిండియాకు కఠిన సవాలే. ఆ జట్టులో ప్రభాత్ జయసూర్య తన స్పిన్ మాయాజాలంతో ముప్పుతిప్పలు పెట్టగల సమర్థుడు. దీంతో భారత ఓపెనర్లు అతడిని నిలువరించేందుకు ప్రత్యేకంగా స్పిన్‌పైనే ఫోకస్ పెట్టారు. నెట్ బౌలర్లుగా నలుగురు స్పిన్నర్లు.. లంకతో సిరీస్‌లో స్పిన్‌ను మెరుగ్గా ఎదుర్కొనేందుకు గాను బీసీసీఐ.. జట్టుతో పాటు నలుగురు స్పెషలిస్ట్ స్పిన్నర్లను ఎంపికచేసింది. కొటియాన్ (ఆఫ్ స్పిన్), విప్రాజ్ నిగమ్ (లెగ్ స్పిన్), శివాంగ్ కుమార్ (లెఫ్టార్మ్ రిస్ట్ స్పిన్), హర్ష్ దూబే (లెఫ్టార్మ్ ఆర్థోడాక్స్).. నెట్స్‌లో గిల్ సేనకు పరీక్ష పెట్టనున్నారు. ఇప్పటికే జట్టులో రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ ఉండగా ఈ నలుగురినీ నెట్ బౌలర్లుగా పంపించడం గమనార్హం. ఇదిలాఉండగా మంగళవారం సాయంత్రం భారత జట్టు కొలంబోలో దిగింది. లంకతో టెస్టు సిరీస్ ఈనెల 15 నుంచి మొదలుకాను

# లోయ నుంచి వీరుడొచ్చాడు



నమస్తే తెలంగాణ క్రీడా విభాగం ; జమ్మూ కశ్మీర్ పేరు వినగానే ఎవరికైనా మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలు, పచ్చటి మైదానాలు, ఆహ్లాదాన్ని పంచే అందమైన లోయలే గుర్తొస్తాయి. కానీ, కొన్ని రోజులుగా భారత క్రికెట్‌లో మాత్రం ఓ యువకుడి పేరు మారుమోగుతోంది. తన బౌలింగ్ పదునుతో దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపి.. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో జమ్మూను తొలిసారి విజేతగా నిలిపి అందరి మన్ననలూ అందుకున్న పేసర్ ఆకిబ్ నబీ ఇప్పుడు భారత టెస్టు జట్టులోకి వచ్చి సరికొత్త చరిత్ర సృష్టించాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యాడు. తన పదునైన సీమ్, స్వింగ్ బౌలింగ్‌తో ఇతర రాష్ట్రాల బ్యాటర్లను బెంబేలెత్తించిన నబీ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. జమ్మూ నుంచి ఇప్పటికే పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ టీమిండియా గడపతొక్కగా.. ఇప్పుడు ఆకిబ్ మరో అడుగు ముందుకేసి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఆ రాష్ట్ర తొలి ఆటగాడిగా రికార్డులకెక్కాడు. అయితే, అతని ప్రయాణం అంత సాఫీగా సాగలేదు. బస్సు చార్జీలకు డబ్బుల్లేక.. స్నేహితుల బూట్లు అడుక్కొని క్రికెట్ ఆడిన రోజుల నుంచి సరైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు లేని ప్రాంతంలో ఎన్నో కష్టాలు, ప్రతికూలతలు దాటుకొని జాతీయ జట్టులోకి వచ్చాడు.

**తండ్రితో పోరాడి.. బంతి పట్టి**

బారాముల్లా జిల్లా శీరి అనే చిన్న గ్రామానికి చెందిన ఆకిబ్ నబీ తండ్రి గులామ్ నబీ దార్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. కొడుకు చదువు పూర్తి చేసి డాక్టర్ కావాలని ఆయన ఆశపడ్డాడు. కానీ, నబీకి మాత్రం పుస్తకాలతో కుస్తీ కంటే మైదానంలో బ్యాటు, బంతితో ఆట అంటేనే ఎక్కువ ఇష్టం. క్లాసులు ఎగ్గొట్టి క్రికెట్ ఆడి తండ్రితో తిట్లుతినేవాడు. ఇంటర్మీడియట్ బయాలజీ పరీక్షల సమయంలో ఆస్ట్రేలియా బౌలింగ్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ నేతృత్వంలో చెన్నైలో జరిగిన బీసీసీఐ పేస్ బౌలింగ్ క్యాంప్‌నకు ఆకిబ్ ఎంపికయ్యాడు. పరీక్షలు వదిలి చెన్నై వెళ్లడానికి తండ్రి మొదట్లో ఒప్పుకోలేదు. కానీ, ఆకిబ్ తొలి క్లబ్ కెప్టెన్ జుబేర్ దార్ అతని అపార ప్రతిభను తండ్రికి విడమరిచి చెప్పాడు. చివరికి కొడుకు కలను నెరవేర్చడానికి గులామ్ నబీ రూ. 10 వేలు అప్పు చేసి, ఆకిబ్‌ను విమానంలో చెన్నై పంపించాడు. ఆ ఒక్క నిర్ణయమే ఆకిబ్ జీవితాన్ని, జమ్మూ క్రికెట్ భవిష్యత్తును పూర్తిగా మార్చేసింది.

**దోస్తు బూట్లతో బౌలింగ్**

క్రీడా జీవితం ఆరంభంలో బారాముల్లా ఆటగాడు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం. మొదట్లో తనకు ఆట తప్ప ఏమీ తెలిసేది కాదు. తను ఎంత అమాయకంగా ఉండేవాడంటే, క్లబ్ క్రికెట్ ఆడటానికి రూ. 10 కట్టాలా? అని అడిగేవాడు. తొలిసారి శ్రీనగర్‌లోని షేర్-ఈ-కశ్మీర్ మైదానంలో టర్ఫ్ వికెట్‌పై ఆడుతున్నప్పుడు రాత్రంతా నిద్రపోలేదు. తీరా మైదానంలోకి దిగాక మొదటి బంతికే జారిపడ్డాడు. కారణం అతడి దగ్గర బౌలింగ్ స్పైక్ షూస్ లేకపోవడమే. సహచర బౌలర్ ఒక ఓవర్ వేసి, తన షూస్ ఇస్తే.. దాంతో ఆకిబ్ బౌలింగ్ చేసేవాడు. మైదానాలు, సదుపాయాలు లేకపోవడంతో రోజువారీ ప్రాక్టీస్ కోసం రోజూ బారాముల్లా నుంచి శ్రీనగర్‌కు 60 కిలోమీటర్లు ప్రయాణించేవాడు. ఈ క్రమంలో జమ్మూ కశ్మీర్ మాజీ కెప్టెన్ పర్వేజ్ రసూల్, టీమిండియా మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రోత్సాహం, మార్గనిర్దేశం లభించడం నబీకి వరమైంది. బౌలింగ్ కోచ్ పి. కృష్ణ కుమార్ శిక్షణలో రాటు దేలాడు. తన బలమైన ఔట్ స్వింగర్‌కు తోడు ఇన్ స్వింగర్లు, ఆఫ్ కట్టర్లను కూడా అమ్ములపొదిలో చేర్చుకొని పర్ఫెక్ట్ బౌలర్‌గా మారాడు. 2024-25 రంజీ సీజన్లో 44 వికెట్లు, ఈ సీజన్‌లో ఏకంగా 60 వికెట్లు పడగొట్టి అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్‌పై 4 బంతుల్లో 4 వికెట్లతో సంచలనం సృష్టించాడు.

**ఐపీఎల్‌లో రూ. 8.4 కోట్లు..**

దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఆకిబ్ నబీని 2026 సీజన్ ఐపీఎల్ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ ఏకంగా రూ. 8.4 కోట్లకు సొంతం చేసుకుంది. ఒకప్పుడు బస్సు చార్జీలు, షూస్ కోసం కష్టపడిన కుర్రాడు.. ఒక్కరాత్రితో కోటీశ్వరుడు కావడంతో శీరి గ్రామంలోనే కాకుండా లోయ అంతటా సంబరాలు అంబరాన్ని తాకాయి. చూస్తుండగానే నబీ ఇప్పుడు భారత టెస్టు బెర్త్ సాధించాడు. చదువును వదిలి క్రికెట్ బంతి పట్టినందుకు బాధపడ్డ తండ్రిని నేడు ప్రపంచం ముందు సగర్వంగా తలఎత్తుకునేలా చేసిన ఆకిబ్ కథ.. కష్టాలను జయించి కలలను నెరవేర్చుకోవాలనుకునే ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకం.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.